- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
14-11-2026

సంపుటి : 01 సంచిక : 231 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 231 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha



ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ

- లాహోర్‌ను దాటేసిన దేశ రాజధాని
- ఢిల్లీని కమ్మేసిన విషపూరిత పొగమంచు
- ఐక్యూఎయిర్ లెక్కల్లో 334కు చేరిన గాలి నాణ్యత సూచీ
- కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదికలో 403గా నమోదు
- దట్టమైన పొగమంచుతో రహదారులపై తగ్గిన దృశ్యమానత
- కాలుష్య నియంత్రణకు రంగంలోకి దిగిన మిస్ట్ స్ప్రేయర్లు

భారత్ సమ్మిట్‌పై విపక్షం విషం

రాహుల్ గాంధీ అంటే బీజేపీకి భయం

- కడుపులో విషం.. కళ్లల్లో కోపం.. మీ రాజకీయ ప్రయోజనాల కోసం రాహుల్ పర్యటనను అడ్డుకోవద్దు.
- రాహుల్ గాంధీ భారతీయ ఆత్మ.. ఆయనను ఏ లాంచ్ చేయాల్సిన అవసరం లేదు.
- రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయి.
- సమ్మిట్‌కు విదేశీ ప్రతినిధులను అనుమతించి.. చివరి నిమిషంలో అడ్డుకున్న కేంద్రం.
- సదస్సుపై బీజేపీ, బీఆర్ఎస్ ఎందుకు అభ్యంతరమో తెలియడం లేదు.
- ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నామని బీజేపీ ఆరోపిస్తోంది.
- తెలంగాణ ప్రత్యేకతలను ప్రపంచానికి చాటి పెట్టుబడులను ఆకర్షించడమే సమ్మిట్ లక్ష్యం.
- స్వాతంత్ర్యానికి ముందు బీజేపీ లేదు.. 25 ఏళ్ల తర్వాత ఆ పార్టీ ఉండదు.
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



భారత్ సమ్మిట్, రాహుల్ గాంధీ పర్యటనను అడ్డుకోవాలని బీజేపీ చూస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. రాహుల్ అంటే బీజేపీకి భయమని, రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ అభివృద్ధికి విపక్షాలు ఆటంకం కలిగించవద్దని హితవు పలికారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు, మానవ వనరుల సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడమే భారత్ సమ్మిట్ లక్ష్యమని స్పష్టం చేశారు. సుమారు 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులను ఆహ్వానించామని, గిగ్ కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపే ప్రత్యేక విధానాన్ని తెలంగాణలో తీసుకొస్తున్నామని వెల్లడించారు. 2047 నాటికి తెలంగాణను మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు విపక్షాలు నిర్మాణాత్మక సహకారం అందించాలని కోరారు.



ఇది అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం

- హరీష్‌రావు అవినీతిపై విచారణ చేసే దమ్ముందా?
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో దగాపడ్డ ప్రజలు
- సామాజిక న్యాయం కోసం అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తా
- సిద్దిపేట జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ భవనానికి శంకుస్థాపన చేసిన కల్వకుంట్ల కవిత

సిద్దిపేట, నవంబర్ 13 మహాప్రభ

సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుపై చేసిన అవినీతి ఆరోపణలపై సీఎం విచారణ ఎందుకు చేయడంలేదని తెలంగాణ రక్షణ సమితి అధినేత్రి కవిత ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం సమీపంలో శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయ భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈనెల 19న సిద్దిపేటకు వస్తున్న సీఎంకు హరీష్ రావు అవినీతిపై ప్రకటించే దమ్ముందా అని సవాల్ చేశారు.

-మిగతా 3 లో



నా ఫోన్ ట్యాప్ చేశారు..
మోదీ చర్చకు రావాలి

- తన ఫోన్‌ను ట్యాప్ చేశారని కాంగ్రెస్ అగ్రనేత వ్యాఖ్య
- తనపై నిఘా ఉన్న విషయం ప్రధాని మోదీకి తెలుసని ఆరోపణ
- ప్రధానితో ముఖాముఖి చర్చకు రాహుల్ సవాల్
- విదేశీ శక్తుల నియంత్రణ, దేశ వ్యతిరేక కార్యకలాపాలపై చర్చ జరగాలని డిమాండ్
- ఎక్కడైనా, ఎవరిని న్యాయనిర్ణేతగా పెట్టినా సిద్ధమేనని ప్రకటన
- రాహుల్ వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్



మైక్రోసాఫ్ట్ 365 సేవల్లో అంతరాయం..

- 5 గంటలు స్తంభించిన వివిధ అప్లికేషన్లు

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- లోయలో పడ్డ వాహనం.. 11 మంది దుర్మరణం
- గిల్గిట్-బాల్టిస్తాన్ పర్వత ప్రాంతంలో ఘటన
- డ్రైవర్ అదుపు తప్పడంతో లోయలోకి దూసుకెళ్లిన వాహనం
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- శుక్రవారం ఉదయం వరకు కొనసాగిన సహాయక చర్యలు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశం



కివీస్ దెబ్బకు కుప్పకూలిన భారత్!

- నాలుగో వన్డేలో 244 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్ విజయం
- తొలి ఓవర్‌లోనే రోహిత్, కోహ్లీ, అయ్యర్‌లను డకౌట్ చేసిన మ్యాట్ హెన్రీ
- ఆరు వికెట్లతో భారత బ్యాటింగ్ పతనానికి కారణమైన కివీస్ పేసర్
- 333 పరుగులు చేసిన న్యూజిలాండ్.. 89కే చాపచుట్టేసిన భారత్
- 125 పరుగులతో రాణించిన విల్ యంగ్
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో కొనసాగుతున్న టీమిండియా

వన్డే చరిత్రలో పరుగుల పరంగా భారత్‌కు రెండో అతిపెద్ద ఓటమి





తెలంగాణలో పెరగనున్న చలి తీవ్రత

- రానున్న రెండు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు తగ్గే అవకాశం
- రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ కేంద్రం వెల్లడి
- చలి నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ఆరోగ్య సూచనలు
- ఐదేళ్లలోపు చిన్నారులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచన
- జ్వరం, దగ్గు, గొంతునొప్పి ఉంటే వైద్యులను సంప్రదించాలని స్పష్టీకరణ
- అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి

హైదరాబాద్:నవంబర్ 13 మహాప్రభ

తెలంగాణలో చలి తీవ్రత మరింత పెరగనుంది. రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర తగ్గే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ సమయంలో ప్రధానంగా పొడి వాతావరణం కొనసాగుతుందని తెలిపింది. ఉష్ణోగ్రతలు పడిపోతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ సూచించింది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు,

-మిగతా 3 లో



యోగాతో భారత్‌కు గుర్తింపు

- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణపై మోదీ హర్షం
- సౌదీ అరేబియాలో క్రీడాంశంగా గుర్తింపు
- ఆయుర్వేదానికి 28 దేశాల మద్దతు
- బెంగళూరు ప్రశాంతి కుటీరం గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ప్రధాని
- నగరంలో మెట్రో పింక్ లైన్ తో పాటే వందేభారత్ ప్రారంభం
- మంగళూరు భూగర్భ ఎల్‌పీజీ నిల్వ కేంద్రం జాతికి అంకితం
- విద్యుత్, పునరుత్పాదక ఇంధన, వ్యర్థాల నుంచి వాయువు తయారీ ప్రాజెక్టులకు శ్రీకారం

కాంగ్రెస్ పాలన ఎల్‌నినో కంటే
ప్రమాదకరం

కరువు వేళ రైతులను ఆదుకోవాల్సింది పోయి సమ్మిట్‌ల పేరుతో ప్రజాధనం దుబారా చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శ

- కాంగ్రెస్ పాలనతో తెలంగాణ పదేళ్లు వెనక్కి వెళ్లిందని ఆరోపణ
- ప్రభుత్వ భూముల అమ్మకాలకు రేవంత్ రెడ్డి కేరాఫ్‌గా మారారని వ్యాఖ్య
- మియాపూర్ ట్రక్ పార్కు భూములను ఎకరాకు రూ.100 కోట్ల చొప్పున అమ్మకానికి పెట్టారని విమర్శ
- ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడాల్సిన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కేటాయిస్తున్నారని ఆరోపణ
- మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ధీమా
- భూముల వేలంలో పాల్గొంటే భవిష్యత్తులో అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరిక

హైదరాబాద్: నవంబర్ 13 మహాప్రభ

కాంగ్రెస్ పాలన ఎల్‌నినో కంటే ప్రమాదకరంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొంటున్న వేళ ప్రజలను, రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. గ్లోబల్ సమ్మిట్ పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుబారా చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో తెలంగాణ పదేళ్లు వెనక్కి వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ గోబెల్స్ ప్రచారానికి దిగుతోందని మండిపడ్డారు. గతంలో భూముల అమ్మకాలను వ్యతిరేకించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

-మిగతా 3 లో



నగ్న చిత్రానికో దేశ రహస్యం!

విదేశీ ఏజెంట్‌కు ఐఏఎఫ్ వింగ్ కమాండర్ ఆఫర్



న్యూఢిల్లీ:నవంబర్ 13 మహాప్రభ

'నీ ప్రతి నగ్న చిత్రానికి.. నా దేశ రహస్య యుద్ధ ప్రణాళికకు సంబంధించిన ఒక పేజీని పంపుతా' అంటూ హనీట్రాప్‌లో చిక్కుకున్న భారత వైమానిక దళం (ఐఏఎఫ్) వింగ్ కమాండర్ పలు దేశ రహస్యాలను పొరుగుదేశానికి చేరవేశాడు. దేశ రహస్యాలను విదేశాలకు అందిస్తున్నాడన్న అనుమానంతో దేశద్రోహం కింద ఐదు నెలల క్రితం అరెస్టయిన ఐఏఎఫ్ అధికారిపై పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో పలు విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి.చార్జ్‌షీట్‌లోని వివరాల ప్రకారం.. ఆన్‌లైన్‌లో ఒక యువతి పేరిట పన్నిన వలపు వలలో చిక్కుకున్న ఆ ఐఏఎఫ్ వింగ్ కమాండర్ మన దేశపు ఒక రహస్య డ్రోన్ విభాగం బలం, నిర్మాణం, దాని కార్యాచరణ సామర్థ్యాలు, యుద్ధ పరిస్థితుల్లో మోహరింపు కోసం కేటాయించిన ప్రాంతాలు, యుద్ధ విమానాల సమాచారాన్ని పాకిస్థాన్‌కు చెందిన అనుమానిత ఏజెంట్‌కు చేరవేశాడు. జనవరి 1 నుంచి ఏప్రిల్ 1 వరకు ఆ వింగ్ కమాండర్ వాట్సాప్ సందేశాలను పరిశీలించగా పాకిస్థాన్ ఏజెంట్ నుంచి ఒక నగ్నచిత్రం అందుకున్న తర్వాత రహస్య యుద్ధ ప్రణాళికకు సంబంధించిన ఒక పేజీని అప్‌లోడ్ చేశాడు. అంతేకాకుండా ప్రతి నగ్న చిత్రానికి బదులుగా ఒక యుద్ధ ప్రణాళికలోని కొత్త పేజీని అందిస్తానని వాగ్దానం చేశాడు. కంప్యూటర్, ఇతర పరికరాల్లో ఉన్న సున్నితమైన సమాచారాన్ని, అతడు ఇతర అధికారులతో జరిపిన రహస్య సమాచారాన్ని ఆ ఏజెంట్‌కు పలుమార్లు చేరవేశాడు. వారిద్దరి మధ్య 3,008 టెక్స్ మెసేజ్‌లు, నాలుగు వీడియో కాల్స్ జరిగాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

రసగుల్లాలో బాంబు..
నోట్లో పేలి వ్యక్తి మృతి

మధ్యప్రదేశ్‌లో విషాద ఘటన



దిండోరి: నవంబర్ 13 మహాప్రభ

మధ్యప్రదేశ్‌లోని దిండోరి జిల్లాలో ఈ నెల 10న విషాద ఘటన జరిగింది. రసగుల్లా లోపల ఉన్న బాంబు పేలడంతో అది తిన్న ఓ వ్యక్తి(35) తీవ్రంగా గాయపడి చనిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్ర భరౌటియా రాత్రి కుటుంబంతో కలిసి చలి మంట దగ్గర కూర్చొని ఉండగా నిందితుడు పొరుగున ఉండే నిందితుడు రామ్‌భగత్ అతడికి ఓ రసగుల్లా ఇచ్చి తినమన్నాడు.రాజేంద్ర దాన్ని తినగానే అందులో ఉన్న పందులను చంపే బాంబు పేలి అతడి నోరు, దవడకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని దవాఖానకు తరలించారు. అయితే కొన్ని గంటల తర్వాత అతడు మరణించాడు. తాను ఇచ్చింది రసగుల్లా మాత్రమేనని నిందితుడు చెప్పాడు. నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ ఘటనకు గల కారణాన్ని, రసగుల్లా లోపల బాంబు ఎలా వచ్చిందన్న విషయాన్ని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు-ట్రక్కు ఢీ.. 26 మంది మృతి

మృతుల్లో ఎక్కువ మంది విద్యార్థులే

అస్సాంలో దారుణ ఘటన



దిస్పూర్ నవంబర్ 13 మహాప్రభ

అస్సాంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 26 మంది ప్రయాణికులు చనిపోయారు. వీరిలో విద్యార్థులే ఎక్కువ. గోలాఘాట్ జిల్లా పరిధిలోని రంగాజన్ వద్ద జాతీయ రహదారి-715పై ఈ ప్రమాదం జరిగింది. గాలాఘాట్ నుంచి నాగావ్‌కు వెళ్తున్న మినీబస్సు ఎదురుగా వస్తున్న కంటైనర్ ట్రక్కును బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బస్సు నుజ్జునుజ్జయింది. 15మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. 8 మంది దవాఖానలో చికిత్స పొందుతూ చనిపోయారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలున్నాయి. కజిరంగా పార్కు సమీపంలో మినీ బస్సు అధిక వేగంతో ప్రయాణించడమే ప్రమాదానికి కారణం అని ప్రాథమికంగా పోలీసులు అంచనా వేస్తున్నారు.

కిస్నా' షోరూమ్‌లో 10 కోట్ల విలువైన నగల చోరీ

భోపాల్: నవంబర్ 13 మహాప్రభ



మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాలో దొంగలు రూ.10 కోట్ల విలువైన బంగారు నగలను చోరీ చేశారు. గురువారం తెల్లవారుజామున దుండగులు కట్నీ నగరంలోని కిస్నా బంగారు నగల షోరూమ్ వెనక గోడకు గ్యాస్ కట్టర్‌తో రంధ్రం చేసి లోపలికి ప్రవేశించారు. బంగారు, వజ్రాల ఆభరణాలను భద్రపరిచే సేఫ్‌లను కట్ చేసి అందులోని రూ.10 కోట్ల విలువైన నగలను దోచుకెళ్లారు.ఈ చోరీలో ఆరుగురు దొంగలు పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల ఆచూకీ కోసం సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. దీపావళి నేపథ్యంలో తన షాపులో ఎక్కువ నగలు ఉంచినట్టు షోరూమ్ యజమాని వాపోయారు. ఇటీవల మధురైలో తనిష్క్ నగల దుకాణంలో కూడా ఇదే తరహా దొంగతనం జరిగింది.

మణిపూర్‌లో రహదారిపై వెళ్తున్న వాహనాలపై మిలిటెంట్లు కాల్పులు..

ఇంఫాల్: నవంబర్ 13 మహాప్రభ



మణిపూర్‌లో జాతి హింస కొనసాగుతున్నది. ఇంఫాల్-ఉఖ్రుల్ రహదారిపై వెళ్తున్న రెండు వాహనాలపై మిలిటెంట్లు కాల్పులు జరిపారు. ఒక వాహనంలో ఉన్న తల్లీకుమారుడు, మరో వాహనంలో ప్రయాణించిన ఇద్దరు సోదరులు మరణించారు. (వీఅశ్రీఱ్ఱుత్ం ాజూవఅ ళీఅతీవ ాఅ ఎవష్ట్రఅఱశ్రీవం) శుక్రవారం ఇంఫాల్ వైపు ప్రయాణిస్తున్న రెండు వాహనాలను మిలిటెంట్లు లక్ష్యంగా చేసుకున్నారు. 'న్యూ హేవన్' వద్ద మెరుపుదాడికి పాల్పడి కాల్పులు జరిపారు. ఒక వాహనంలో ప్రయాణించిన తషార్ గ్రామానికి చెందిన తల్లి, కుమారుడైన ఆగస్ట్ నగాలుంగ్, ఖాన్మిలా ఈ కాల్పుల్లో మరణించారు. అలాగే మరో వాహనంలో వెళ్తున్న షాంగ్‌షాక్ గ్రామానికి చెందిన సోదరులైన కపాంగ్‌ఖుయ్ ఆర్ఎస్, హౌలీలా ఆర్ఎస్ కూడా కాల్పుల్లో చనిపోయారు.కాగా, మణిపూర్ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) నేత కె. మేఘచంద్ర ఈ కాల్పుల సంఘటనను ఖండించారు. జాతి హింసను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. నాగా ప్రజలతో సహా వివిధ వర్గాల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మూడున్నరేళ్లకు పైగా హింస కొనసాగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు భద్రత కల్పించడంలో, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడంలో విఫలమైన సీఎం ఖేమ్‌చంద్ నేతృత్వంలోని ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రాజస్థాన్‌లో ఓటర్ల జాబితాలో గందరగోళం!

'సర్' కన్నా ఎస్ఎస్ఆర్ జాబితాలో 11 లక్షల మంది అధికం



న్యూఢిల్లీ, నవంబర్ 13 మహాప్రభ

స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్) 2027 కింద గురువారం ప్రచురించిన రాజస్థాన్ తాజా ముసాయిదా ఓటర్ల జాబితా కొత్త గణాంక గందరగోళానికి దారితీసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రచురించిన సర్ జాబితాలో మొత్తం 5.15 కోట్ల ఓటర్లు ఉంటే ఈ జాబితాలో దాదాపు 5.26 కోట్ల ఓటర్లు ఉన్నారు.ఇది తాజా జాబితాలో దాదాపు 11 లక్షల మంది ఓటర్లు అధికంగా ఉన్నారు. అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం జాబితాలో 5.45 కోట్ల మంది ఓటర్లున్నారని తేలింది. ఇదిలా ఉండగా సర్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న సంస్థలు, కార్యకర్తల వేదిక 'పీపుల్ అగైనెస్ట్ సర్' ఈనెల 26 నుంచి డిసెంబర్ 20 వరకు దేశవ్యాప్త నిరసనలను ప్రకటించింది.

హిమాచల్ ప్రదేశ్‌లో వింత పండుగ!

పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఇద్దరూ పురుషులే..

న్యూఢిల్లీ, నవంబర్ 13 మహాప్రభ



భారతీయ సంప్రదాయంలో పెళ్లంటే అమ్మాయి అబ్బాయి ఉంటారు.. కానీ ఇద్దరు మగాళ్లకే పెళ్లిళ్లు చేయడం ఎప్పుడైనా చూశారా! పెళ్లంటే ఏదో అల్లాటప్పగా జరగదు.. ఒక అబ్బాయి పెళ్లికూతురిలా రంగురంగుల దుస్తులు, నగలు ధరించి అందంగా ముస్తాబైతే.. ఇంకో అబ్బాయి పెళ్లి కొడుకులా తయారవుతాడు. వీరిద్దరికీ మేళతాళాలతో పెళ్లి చేయడమే కాదు.. ఊరంతా ఘనంగా ఊరేగిస్తారు కూడా!! వినడానికి విచిత్రంగా ఉన్నప్పటికీ.. హిమాచల్ ప్రదేశ్‌లోని ఓ గ్రామంలో తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ప్రతి ఏడాది వసంతకాలానికి ముందు ఈ రౌలాణీ ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

ఏమిటీ రౌలాణీ పండుగ?

హిమాచల్‌ప్రదేశ్‌లోని కిన్నౌర్ జిల్లాలో కల్పా అనే చారిత్రక గ్రామం ఉంది. ఇక్కడి ప్రజలకు ప్రకృతితో ముడిపడిన అనేక సంప్రదాయాలు ఉన్నాయి. వాటిలో రౌలాణీ ఉత్సవం ఒకటి. స్థానికుల నమ్మకం ప్రకారం.. శీతాకాలంలో 'సొణి' అనే పర్వత ఆత్మలు గ్రామ పరిసరాల్లో సంచరిస్తూ ప్రజలను, పశువులను ఆపదల నుంచి కాపాడుతాయి. వసంతకాలం ప్రారంభం కాగానే అవి తిరిగి పర్వత ప్రాంతాలకు వెళ్లిపోతాయని విశ్వసిస్తారు. వాటికి కృతజ్ఞతలు తెలుపుతూ ఐదు నుంచి ఏడు రోజుల పాటు ఈ వేడుక నిర్వహిస్తారు.

వధూవరులుగా ఇద్దరు పురుషులు

ఈ పండుగలో ఇద్దరు పురుషులు వరుడు, వధువు పాత్రలు పోషిస్తారు. వరుడిని 'రౌలా' అని, వధువును 'రౌలాణీ' అని పిలుస్తారు. రౌలా ఎరుపు రంగు గచ్చీ, ఉన్ని దుస్తులు ధరించి ముఖానికి ముసుగు వేసుకుంటాడు. చేతిలో రక్షణకు ప్రతీకగా 'రాకస్' అనే కత్తిని పట్టుకుంటాడు. ఇక రౌలాణీ వధువు తరహాలో కత్తి, చోళీ, నడుము బెల్టు ధరించి పూలతో అలంకరించిన కిరీటాన్ని పెట్టుకుంటాడు. డాగ్లో, బిత్రీ, కౌంతాయ్ వంటి వెండి ఆభరణాలను ధరిస్తాడు.

నాగిన్ నారాయణ ఆలయం వద్ద ఈ ఉత్సవానికి సంబంధించిన కార్యక్రమాలు జరుగుతాయి. సంప్రదాయ దుస్తుల్లో సిద్ధమైన రౌలా, రౌలాణీ నెమ్మదిగా అడుగులు వేస్తూ ప్రత్యేకమైన 'రోలాణీ' నృత్యం చేస్తారు. డోలు, దమౌ వాయిద్యాల మోత మధ్య గ్రామమంతా ఊరేగింపు సాగుతుంది. ఈ సందర్భంగా బార్లీ పిండిని చల్లుతూ వేడుకకు మరో ప్రత్యేకతను తీసుకొస్తారు. దీంతో అక్కడి వాతావరణం హోలీ పండుగను తలపిస్తుంది. గ్రామస్థులంతా సంప్రదాయ హిమాచలి దుస్తులు ధరించి ఈ వేడుకల్లో పాల్గొంటారు.

ఇలా వధూవరులుగా ఇద్దరు పురుషులు మారడం, పరిలకు కృతజ్ఞతలు చెప్పడం, ఊరంతా కలిసి నృత్యాలు చేయడం.. రౌలాణీ ఉత్సవాన్ని హిమాచల్‌ప్రదేశ్‌లోని ప్రత్యేక సాంస్కృతిక వేడుకల్లో ఒకటిగా నిలబెట్టాయి

తండ్రిని కాపాడేందుకు నకిలీ బెయిల్ పత్రాలు!

రాజస్థాన్ హైకోర్టుకు అప్‌లోడ్ చేసి చిక్కిన టెకీ

న్యూఢిల్లీ, నవంబర్ 13 మహాప్రభ



పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చి షరతులను ఉల్లంఘించిన తన తండ్రిని కాపాడేందుకు కెనడాకు చెందిన ఒక ఐటీ ఇంజినీర్ నకిలీ పత్రాలతో న్యాయవ్యవస్థను మోసం చేయడానికి ప్రయత్నించిన ఘటన సంచలనం సృష్టించింది. వైద్య అత్యవసర పరిస్థితి కారణంగా పెరోల్‌పై బయటకు వచ్చిన తన తండ్రి, దాన్ని ఉల్లంఘించడంతో ఆయనను కాపాడటానికి ఆ టెకీ 4,000కు పైగా పాత బెయిల్ ఉత్తర్వులను విశ్లేషించాడు.

కృత్రిమ మేధ(ఏఐ)ను ఉపయోగించి రాజస్థాన్ హైకోర్టుకు చెందిన కచ్చితమైన, చట్టపరమైన భాష, ఫార్మాటింగ్, అధికారిక ముద్రలను యథాతథంగా నకిలీలు సృష్టించాడు. ఆ తర్వాత అతను అధికారిక పోర్టల్‌ను హ్యాక్ చేసి తాను తయారుచేసిన నకిలీ 30 రోజుల బెయిల్ ఉత్తర్వులను నేరుగా ప్రభుత్వ వ్యవస్థలోకి అప్‌లోడ్ చేశాడు. స్థానిక సూరత్‌గఢ్ కోర్టులో ఈ నకిలీ పత్రాలను ధైర్యంగా సమర్పించే వరకు వారి సైబర్ నేరం బయటపడలేదు. అయితే రిజిస్ట్రీలో తేదాలు అనుమానాలను రేకెత్తించడంతో వారి బండారం బయటపడింది. దీంతో వారి కోసం పోలీసు గాలింపు మొదలైంది. చివరకు పంజాబ్‌లోని లూథియానాలో తండ్రీకొడుకులిద్దరూ అరెస్టు అయ్యారు.

ఫేక్ ఆర్డర్స్ నమ్మి వెబ్‌సైట్‌ల రద్దుకు డీవోటీ ఉత్తర్వులు రెండు నకిలీ కోర్టు ఆర్డర్ల ఆధారంగా 129 బెట్టింగ్ వెబ్‌సైట్లను నిలిపివేస్తూ సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వమే ఆదేశాలు జారీ చేసిన విషయం దేశవ్యాప్తంగా సంచలనం కలిగిస్తున్నది. ఒక కేంద్ర ప్రభుత్వ శాఖ ఇలా సైబర్ నేరగాళ్ల వలలో ఎలా పడింది? దీనివెనుక ఎవరి హస్తం ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ (డీవోటీ) ఈ ఏడాది 129 అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలకు ఆధారంగా చూపిన రెండు హైకోర్టు ఉత్తర్వులు నకిలీవని తేలింది. ఈ విషయాన్ని రాయిటర్స్ తన పరిశోధన ద్వారా వెల్లడించింది. ఈ పరిశోధనలో వెలుగులోకి వచ్చిన విషయాల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో దీనిపై పోలీస్ దర్యాప్తు ప్రారంభమైంది.

ఆన్‌లైన్ ఉనికికి భారీ ముప్పు

రాజస్థాన్ హైకోర్టు, యూపీ అలహాబాద్ హైకోర్టు జారీ చేసినట్టుగా పేర్కొంటూ వచ్చిన ఉత్తర్వులు భారత దేశ అధికారిక కంటెంట్ తొలగింపు వ్యవస్థ ద్వారా ఆమోదం పొంది అమలయ్యాయి. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన వ్యవస్థల్లో ఒకటిగా దీనికి గుర్తింపు ఉంది. అయితే నకిలీ కోర్టు ఉత్తర్వులు ఈ పటిష్ఠమైన వ్యవస్థ నుంచి అమలులోకి వస్తున్నాయని రాయిటర్స్ కథనం ప్రకారం తెలుస్తున్నది. ఈ వ్యవస్థలో ఉన్న లోపం కారణంగా, భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహించే ఏ సంస్థ అయినా ఆన్‌లైన్ ఉనికికి ముప్పు ఎదుర్కొనే అవకాశం ఉంది.డాట్ జూలై 21, సెప్టెంబర్ 2న రెండు బ్లాకింగ్ ఆదేశాలను జారీ చేసింది. ఈ రెండూ దాని వెబ్‌సైట్‌లో సాధారణ అప్‌లోడ్‌లలో భాగంగా అందుబాటులో ఉన్నాయి. దీనితో పాటు డజన్ల కొద్దీ వెబ్‌సైట్లను తొలగించాలని ఆదేశిస్తూ కోర్టు ఉత్తర్వులుగా పేర్కొంటున్న వాటి ఈమెయిల్ కాపీలు కూడా జతచేసి ఉన్నాయి. అయితే డాట్ ఉదహరించిన ఈ కోర్టు ఉత్తర్వులు ఆ రెండు కోర్టులకు సంబంధించిన వెబ్‌సైట్‌ల్లో రాయిటర్స్‌కు లభ్యం కాలేదు.

స్పందించిన హైకోర్టులు

దీనిపై రాయిటర్స్ కోరిన వివరణపై రాజస్థాన్ హైకోర్టు స్పందించింది. డాట్ ఉత్తర్వుల్లో పేర్కొన్న కోర్టు ఉత్తర్వులు నకిలీవని, ఆ ఉత్తర్వులు తమ సర్వర్‌లో లేవని పేర్కొంది.

వాతావరణ సూచీలో మరింత దిగజారిన భారత్

అంటాల్యా, నవంబర్ 13 మహాప్రభ



వాతావరణ మార్పు పనితీరు సూచీలో భారత్ స్థానం మరింత దిగజారింది. తుర్కియేలోని అంటాల్యాలో బుధవారం జరిగిన ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పు సదస్సు (కాప్31)లో విడుదలైన వాతావరణ మార్పు పనితీరు సూచీ (సీసీపీఐ)లో భారత్ 28వ స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే భారత్ ఐదు స్థానాలు దిగజారింది. సూచీలోని అన్ని విభాగాల్లో ఏ దేశమూ మెరుగైన ప్రదర్శన చేయకపోవడంతో తొలి మూడు స్థానాలను ఖాళీగా ఉంచారు.

ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ

- లాహోర్‌ను దాటేసిన దేశ రాజధాని
-ఢిల్లీని కమ్మేసిన విషపూరిత పొగమంచు
- ఐక్యూఎయిర్ లెక్కల్లో 334కు చేరిన గాలి నాణ్యత సూచీ
- కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదికలో 403గా నమోదు
- దట్టమైన పొగమంచుతో రహదారులపై తగ్గిన దృశ్యమానత
- కాలుష్య నియంత్రణకు రంగంలోకి దిగిన మిస్ట్ స్ప్రేయర్లు



న్యూఢిల్లీ:
దేశ రాజధాని ఢిల్లీని విషపూరిత పొగమంచు కమ్మేసింది. వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరడంతో ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ నిలిచింది. పొరుగు దేశమైన పాకిస్థాన్‌లోని లాహోర్‌ను సైతం వెనక్కి నెట్టింది. నగరవ్యాప్తంగా దట్టమైన పొగమంచు అలుముకోవడంతో గాలి నాణ్యత గణనీయంగా పడిపోయింది. దీంతో ప్రజలు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్విట్జర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ గాలి నాణ్యత పర్యవేక్షణ సంస్థ ఐక్యూఎయిర్ తాజా లెక్కల ప్రకారం ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 334గా నమోదైంది. ఈ స్థాయిని ప్రమాదకర విభాగంగా పేర్కొంది. మరోవైపు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదికలో ఈ సూచీ 403గా నమోదైంది. పరిస్థితిని అత్యంత తీవ్రంగా వర్గీకరించింది. ఈ రెండు సంస్థలు అనుసరించే కొలతల విధానాల్లో తేడా ఉండటంతో గణాంకాల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. సాధారణంగా గాలి నాణ్యత సూచీ 50లోపు ఉంటేనే ఆరోగ్యకరమైన స్థాయిగా పరిగణిస్తారు. దాదాపు రెండు కోట్ల మందికి పైగా జనాభా ఉన్న ఢిల్లీ ప్రాంతం ప్రస్తుతం పొగమంచు ముసుగులో చిక్కుకుంది. రహదారులపై దృశ్యమానత తగ్గిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధి దీపాలు సైతం పొగమంచులో కనిపించని పరిస్థితి నెలకొంది. కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు అధికారులు కీలక ప్రాంతాల్లో మిస్ట్ స్ప్రేయర్లను ఏర్పాటు చేసి గాల్లోకి నీటిని పిచికారీ చేస్తున్నారు. తద్వారా దుమ్ము, ధూళి కణాలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు.

నా ఫోన్ ట్యాప్ చేశారు.. మోదీ చర్చకు రావాలి:



న్యూఢిల్లీ:
తన ఫోన్‌ను ట్యాప్ చేశారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తనపై నిఘా కొనసాగుతున్న విషయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలుసని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రధాని మోదీ తనతో ముఖాముఖి చర్చకు రావాలని సవాల్ విసిరారు. విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరు ఉన్నారు? దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నది ఎవరు? అనే విషయాలు చర్చలో తేలుతాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ మాట్లాడిన వీడియోను పోస్టు చేసింది. అందులో మోదీయే తన ఫోన్‌ను ట్యాప్ చేయించారని రాహుల్ ఆరోపించారు. ప్రధానికి తనతో చర్చించే ధైర్యం లేదని, ఆయన స్క్రిప్టు చూసి మాట్లాడతారని విమర్శించారు. ఎక్కడైనా చర్చకు సిద్ధమని, ప్రధాని తన టెలిప్రాంప్టర్‌ను తీసుకొచ్చినా అభ్యంతరం లేదని అన్నారు. తనకు నచ్చిన వ్యక్తిని చర్చకు న్యాయనిర్ణేతగా నియమించుకోవచ్చని సూచించారు. నిజమైన దేశద్రోహి ఎవరో తేలాలంటే చర్చకు రావాల్సిందేనని పేర్కొన్నారు. తనతో నేరుగా చర్చలో పాల్గొంటే ప్రధాని రాజకీయ ప్రస్థానం ముగుస్తుందని రాహుల్ వ్యాఖ్యానించారు. రాహుల్ ఆరోపణలను బీజేపీ ఖండించింది. కేరళ బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ స్పందిస్తూ.. రాహుల్ ఫోన్‌ను ఎవరూ ట్యాప్ చేయడం లేదని, ఆయన ఫోన్‌పై ఎవరికీ ఆసక్తి లేదని అన్నారు. రాహుల్ వ్యాఖ్యలు నిరాధారమైనవని విమర్శించారు. ఆయన ఆరోపణలపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

ఇద్ది అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి తరువాయి)

ఈ విషయంలో సీఎం పట్టించుకోకుంటే ప్రజాక్షేత్రం లో కొట్లాడుతామని హెచ్చరించారు. హరీష్ రావు ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆసుపత్రులకు పాల సరఫరా చేయించి రూ.2000 కోట్ల పాల వ్యాపారం చేశారని, నిమ్స్ ఆసుపత్రిలో జరిగిన రూ.100 కోట్ల కుంభ కోణంలో హరీష్ రావు పాత్ర ఉందని ఆరోపించారు. ఎన్నికల సందర్భం గా హరీష్ రావు సమర్పించిన అఫిడవిట్లలో ఆస్తులు ఎలా పెరిగాయో వివరించాలని డిమాండ్ చేశారు. రంగనాయ క సాగర్ ప్రాజెక్టు భూమి సేకరణ పేరిట ఆరు లక్షల రూపాయల చొప్పున 14 ఎకరాల భూమి సేకరించి ఫామ్‌హౌస్ కట్టుకున్న హరీష్ రావు అక్రమానికి పాల్పడ్డ సంఘటనపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కొండ పోచమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై ఇంజనీర్లపై చర్యలు తీసుకున్న సర్కారు నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్ రావుపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ అంచనా లను భారీగా పెంచి కాంట్రాక్టర్ల వద్ద నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూ లు చేసిన హరీష్ రావు అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్ చేశా రు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మించినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోక పోతే భూకంపం దాటికి ప్రాజెక్టు దెబ్బతింటుందని నిపుణులు చేసిన సూచనలను పక్కకు పెట్టి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండానే ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతితో తనకు సంబంధం లేదని టీఆర్ఎస్ అధినేత్రి కవిత స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్‌తో ఎలాంటి పైరవీలు చేయలేదన్నారు. తాను ఎన్నికలసందర్భంగా ప్రకటించిన అఫిడవిట్‌లో కన్నా ఎంత ఎక్కువ భూమి ఉన్నా ప్రభుత్వానికి ఇచ్చేస్తానని ప్రకటించారు. అవినీతిని ప్రశ్నిస్తే ఎదురు దాడి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో హరీష్ రావును ఓడిస్తామని, సిద్దిపేట గడ్డపై టీఆర్ఎస్ జెండాను ఎగరేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో ప్రజలు దగాపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం తాను అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. ఉచిత విద్య, వైద్యం,రైతులకు సాయం, బడుగులకు సామాజిక న్యాయం లక్ష్యంగా పాంచజన్యం ప్రణాళిక జరిగిందని తెలిపారు. సమావేశంలో పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బోడ జనార్దన్, పార్టీ నేతలు రియాజ్, కొండల్ రెడ్డి, మల్లారెడ్డి, శ్రవణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్‌పై విపక్షం విషం



హైదరాబాద్:
భారత్ సమ్మిట్ నిర్వహణ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటనపై తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం ముదిరింది. రాహుల్ గాంధీ అంటే బీజేపీకి భయమని, అందుకే ఆయన పర్యటనను అడ్డుకోవాలని చూస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పెట్టుబడులను ఆకర్షించి తెలంగాణ ప్రత్యేకతలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు నిర్వహిస్తున్న సదస్సుపై బీజేపీ, బీఆర్ఎస్ అనవసర ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర అభివృద్ధికి నష్టం కలిగించవద్దని విపక్షాలకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లో కేంద్ర విదేశాంగ శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, వివేక్ వెంకటస్వామి తదితరులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. రాహుల్ గాంధీ భారతీయ ఆత్మ అని, ఆయనను మళ్లీ పరిచయం చేయాల్సిన అవసరం లేదని అన్నారు. రాహుల్ ప్రధాని అవుతారనే భయంతోనే బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వైఖరిని తప్పుబట్టారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల పరిస్థితులను వివరించేందుకు భారత్ సమ్మిట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 70 దేశాలకు చెందిన నిపుణులు, మంత్రులు, పర్యావరణవేత్తలు, పెట్టుబడిదారులు, జర్నలిస్టులు కలిపి సుమారు వెయ్యి మంది ప్రతినిధులను ఆహ్వానించామని చెప్పారు. అయితే కొందరు విదేశీ ప్రతినిధుల వీసాలు చివరి నిమిషంలో రద్దు కావడంతో వారు విమానాశ్రయం నుంచి వెనుదిరగాల్సి వచ్చిందని ఆరోపించారు. సమ్మిట్ నిర్వహణకు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలను సీఎం ఖండించారు. ఇది నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారం కాదని, ఖర్చు చేసే ప్రతి పైసాకు లెక్క ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణలో ఉన్న మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యమన్నారు. సదస్సులో పర్యావరణం, మౌలిక వసతులు, పెట్టుబడులు, మానవ వనరులు, వాతావరణ మార్పులపై చర్చలు, సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఇందులో పాల్గొనే నిపుణులు తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారని ఆశాభావం వ్యక్తం చేశారు. గిగ్ కార్మికుల సమస్యలపైనా రాహుల్ గాంధీ ప్రసంగిస్తారని రేవంత్ రెడ్డి వెల్లడించారు. కొరియర్ సిబ్బంది, వాహన చోదకులు, వేదిక ఆధారిత సేవలందించే కార్మికులు, గృహ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా దేశంలోనే ప్రత్యేకమైన గిగ్ వర్కర్ల విధానాన్ని తెలంగాణలో తీసుకొస్తున్నామని చెప్పారు. ఈ విధానాన్ని ఆవిష్కరించే కార్యక్రమానికి రాహుల్‌ను ఆహ్వానించినట్లు వివరించారు. గతంలోనూ మూసీ, మెట్రో, ప్రాంతీయ రింగ్ రోడ్డు వంటి అభివృద్ధి ప్రాజెక్టులను బీఆర్ఎస్, బీజేపీ కలిసి అడ్డుకునే ప్రయత్నం చేశాయని సీఎం ఆరోపించారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజ్‌పేయికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తూ, జాతీయ ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని అన్నారు. తెలంగాణను 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలకు విపక్షాలు అడ్డుపడకుండా నిర్మాణాత్మక సహకారం అందించాలని కోరారు.

కివీస్ దెబ్బకు కుప్పకూలిన భారత్!

- నాలుగో వన్డేలో 244 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్ విజయం
- తొలి ఓవర్‌లోనే రోహిత్, కోహ్లీ, అయ్యర్‌లను డకౌట్ చేసిన మ్యాట్ హెన్రీ
- ఆరు వికెట్లతో భారత బ్యాటింగ్ పతనానికి కారణమైన కివీస్ పేసర్
- 333 పరుగులు చేసిన న్యూజిలాండ్.. 89కే చాపచుట్టేసిన భారత్
- 125 పరుగులతో రాణించిన విల్ యంగ్
- వన్డే చరిత్రలో పరుగుల పరంగా భారత్‌కు రెండో అతిపెద్ద ఓటమి
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో కొనసాగుతున్న టీమిండియా

మౌంట్ మౌంగనుయి:



న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో భారత జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆతిథ్య జట్టు 244 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ ఆధిక్యం 2-1కి తగ్గింది. భారత బ్యాటింగ్ పతనంలో కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ కీలక పాత్ర పోషించాడు. తన తొలి ఓవర్‌లోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్‌లను డకౌట్ చేసి భారత్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం ఆరు వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 333 పరుగులకు ఆలౌటైంది. విల్ యంగ్ 108 బంతుల్లో 125 పరుగులతో అద్భుతంగా రాణించాడు. టిమ్ సీఫెర్ట్ 58 పరుగులు చేయగా, ఫిన్ అలెన్ 41 పరుగులతో సహకరించాడు. దీంతో భారత్ ముందు 334 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. లక్ష్య ఛేదనలో భారత జట్టు ఆరంభం నుంచే తడబడింది. హెన్రీ తొలి ఓవర్‌లోనే ముగ్గురు కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు పంపడంతో భారత్ పరుగుల ఖాతా తెరవకముందే మూడు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత కూడా వికెట్ల పతనం ఆగలేదు. ఇషాన్ కిషన్ 27, అక్షర్ పటేల్ 21, నమన్ ధీర్ 21 పరుగులు చేసినా జట్టును ఆదుకోలేకపోయారు. చివరకు భారత్ 26.4 ఓవర్లలో 89 పరుగులకే ఆలౌటైంది. వన్డే క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా భారత్‌కు ఇది రెండో అతిపెద్ద ఓటమి. 2000లో శ్రీలంక చేతిలో 245 పరుగుల తేడాతో ఎదురైన పరాజయం ఇప్పటికీ అత్యంత భారీ ఓటమిగా కొనసాగుతోంది. తాజా ఓటమి ఆ రికార్డుకు కేవలం ఒక్క పరుగు దూరంలో నిలిచింది.

కాంగ్రెస్ పాలన ఎల్‌నినో కంటే ప్రమాదకరం

(మొదటి తరువాయి)

ఇప్పుడు ప్రభుత్వ భూములను విక్రయిస్తూ వాటి అమ్మకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారారని హరీశ్‌రావు విమర్శించారు. హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ, హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు చెందిన భూములను అమ్మకానికి పెడుతున్నారని ఆరోపించారు. భూములు అమ్ముకుంటూ పోతే చివరకు బొందలగడ్డకు కూడా భూములు మిగలవని గతంలో చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే విధానాన్ని అనుసరిస్తున్నారని విమర్శించారు. ప్రజాప్రయోజనాల కోసం వినియోగించాల్సిన మియాపూర్ ట్రక్ పార్కు భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం విక్రయించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ఎకరాకు రూ.100 కోట్ల చొప్పున భూములను అమ్మకానికి పెట్టడం సరికాదన్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన విలువైన స్థలాలను ప్రైవేటు ప్రయోజనాలకు అప్పగించడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న భూముల వేలంలో ఎవరైనా పాల్గొంటే, భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటికి ఇచ్చిన అనుమతులను తప్పకుండా రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల విక్రయాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

యోగాతో భారత్‌కు గుర్తింపు

బెంగళూరు:
యోగా ప్రపంచానికి భారతదేశాన్ని అర్థం చేసుకునే మార్గంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు ఆదరణ పెరుగుతోందని, అనేక దేశాల్లో ప్రజలు తమ దైనందిన జీవితంలో దానిని భాగం చేసుకుంటున్నారని తెలిపారు. గత 12 ఏళ్లుగా భారత్ చేస్తున్న ప్రయత్నాల ఫలితంగానే అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్త వేడుకగా మారిందని పేర్కొన్నారు. బెంగళూరులోని స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రశాంతి కుటీరం స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విదేశీ పర్యటనల్లో వివిధ దేశాల నేతలతో సమావేశమైనప్పుడు యోగా అంశం తరచూ చర్చకు వస్తోందని చెప్పారు. ప్రపంచ నేతల కుటుంబ సభ్యులు సైతం యోగాను అభ్యసిస్తున్నారని వెల్లడించారు. సౌదీ అరేబియా యోగాను క్రీడా కార్యకలాపంగా గుర్తించడంతోపాటు భారత ఆయుష్ మంత్రిత్వ శాఖతో ఒప్పందం చేసుకుందని మోదీ వివరించారు. ఆయుర్వేదానికి కూడా అంతర్జాతీయంగా ఆదరణ పెరుగుతోందని, వివిధ దేశాల్లో 150కి పైగా శిక్షణ కోర్సులకు గుర్తింపు లభించిందని తెలిపారు. ఆయుర్వేద రంగంలో పరస్పర సహకారం కోసం భారత్ ఇప్పటికే 28 దేశాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని చెప్పారు. యోగా, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం, ఆధునిక వైద్య విధానాలను సమన్వయం చేస్తూ సమగ్ర ఆరోగ్య వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మైక్రోసాఫ్ట్ 365 సేవల్లో అంతరాయం..

-5 గంటలు స్తంభించిన వివిధ అప్లికేషన్లు



న్యూయార్క్:
మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. మైక్రోసాఫ్ట్ 365 కింద పనిచేసే వివిధ అప్లికేషన్లు మొరాయించాయి. గురువారం సుమారు 5 గంటల పాటు ఔట్‌లుక్, టీమ్స్‌తో పాటు ఇతర కొన్ని అప్లికేషన్లు స్తంభించిపోయాయి. దీంతో వేలాది మంది మైక్రోసాఫ్ట్ 365 అప్లికేషన్ యూజర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓపెన్‌ఏఐతో పాటు ఆంత్రోపిక్ సేవలకు కూడా మైక్రోసాఫ్ట్ వల్ల అవరోధాలు కలిగాయి. అయితే సేవలు నిలిచిపోయిన సర్వర్లను రిస్టోర్ చేసేందుకు మైక్రోసాఫ్ట్ వర్క్ చేస్తున్నట్లు తెలిసింది. యూజర్లు మెల్లమెల్లగా తమ సర్వీసులకు కనెక్ట్ అవుతున్నారని కంపెనీ తాజాగా తన రిపోర్టులో చెప్పింది. డౌన్‌డిటెక్టర్ ప్రకారం .. ఔట్‌లుక్ సేవల్లో గురువారం మధ్యాహ్నం తీవ్ర స్థాయిలో అంతరాయం ఏర్పడినట్లు తెలిసింది. అయితే సాయంత్రం వరకు ఆ సమస్య తగ్గింది.మైక్రోసాఫ్ట్ 365కి సంబంధించిన ఇష్యూలు అన్నీ నిన్న సాయంత్రం వరకు గణనీయంగా తగ్గినట్లు కంపెనీ చెప్పింది. టీమ్స్‌ను యాక్సెస్ చేసేందుకు కూడా యూజర్లకు కొంత సమయం పట్టింది. సర్వర్లపై ఒకేసారి అధిక లోడు పడడం వల్ల సేవల్లో అవరోధాలు ఎదురైనట్లు మైక్రోసాఫ్ట్ చెప్పింది. మైక్రోసాఫ్ట్ 365 సర్వీసుల్లో సమస్యలు ఎదుర్కొంటున్న యూజర్ల రిపోర్టులపై దర్యాప్తు చేస్తున్నట్లు కంపెనీ పేర్కొన్నది. ప్రభావానికి గురైన సర్వర్లను మళ్లీ ఆన్‌లైన్‌లోకి తెచ్చే ఏర్పాట్లు జరుగుతున్నట్లు కంపెనీ వెల్లడించింది. కెపాసిటీని రిస్టోర్ చేశామని, యూజర్లు నెమ్మదిగా రికవరీ అవుతారని మైక్రోసాఫ్ట్ తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నది.

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

న్యూఢిల్లీ:
పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిట్-బాల్టిస్తాన్ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పర్వత ప్రాంతంలోని రహదారిపై ప్రయాణిస్తున్న ఓ వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు గాయపడ్డారు. గురువారం రాత్రి ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే వాహనం రహదారిపై నుంచి జారి లోయలో పడినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం కూడా సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగించాయి. ప్రమాదంలో మృతిచెందిన 11 మంది మృతదేహాలతో పాటు గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక మంత్రి అంజద్ హుస్సేన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో రహదారుల పరిస్థితి, రవాణా నిబంధనల అమలుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పర్వత ప్రాంతాల్లో ప్రమాదకర మలుపులు, రహదారుల నిర్వహణ లోపాలు, డ్రైవింగ్ నియంత్రణ కొరవడటం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గత వారం తూర్పు పాకిస్థాన్‌లో బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో 11 మంది మరణించగా, 33 మంది గాయపడటం అక్కడి రోడ్డు ప్రమాదాల తీవ్రతను తెలియజేస్తోంది.

తెలంగాణలో పెరగనున్న చలి తీవ్రత

(మొదటి తరువాయి)

గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తూ ప్రత్యేక ఆరోగ్య సూచనలు జారీ చేసింది. ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా తగ్గడం వల్ల సీజనల్ ఫ్లూ, శ్వాసకోశ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. రవీందర్ నాయక్ తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చలి ప్రభావం వీరిపై ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్నారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచించారు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ముక్కు, నోటికి రుమాలు అడ్డుపెట్టుకోవాలని, చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలని తెలిపారు. అనారోగ్య లక్షణాలు ఉన్నవారు ఇతరులకు వ్యాధులు వ్యాపించకుండా బహిరంగ ప్రదేశాలకు వెళ్లకుండా ఉండాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని వైద్యారోగ్య శాఖ సూచించి

సంపాదకీయం

ఎరువుల సబ్సిడీ
వ్యర్థం కారాదు



దేశంలో దాదాపు 11.38కోట్ల మంది రైతులు, 14.48కోట్ల మంది వ్యవసాయ కూలీలు ఉన్నారని 2011 నాటి జనాభా లెక్కల వివరాలు వెల్లడిస్తున్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలపై రైతులు దేశ వ్యాప్తంగా ఎంత తిరుగుబాటు చేశారో తెలిసిందే. వ్యవసాయ రంగంలో సబ్సిడీల కోత వంటి కఠిన సంస్కరణలు చేపట్టడం కన్నా సబ్సిడీలను పెంచితేనే రైతుల కటాక్షం పొందవచ్చని కేంద్రం నమ్ముతోంది. ఈ నేపథ్యంలో అత్యంత కీలకమైన ఓటు బ్యాంకుగా వ్యవసాయ రంగం ఉంటున్నందున, రానున్న ఎన్నికల ముందు ఎరువుల ధరలు పెరిగితే రైతులు తిరుగుబాటు చేస్తారన్న భయంతో ఎరువుల సబ్సిడీ కేటాయింపును కేంద్ర ప్రభుత్వం అమాంతంగా 64% అత్యధికం చేసిందని రాజకీయ విశ్లేషణలు చెబుతున్నాయి. అయితే ఇందులో ఎన్నికల రాజకీయాల ప్రభావం ఎంతవరకు ఉందో స్పష్టం చేయలేం.

పశ్చిమాసియా సంక్షోభంతో ముఖ్యంగా రష్యా ఉక్రెయిన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు బాగా పెరిగాయని, ఆ ఒడిదుడుకుల ప్రభావం దేశీయ రైతులపై పడకుండా, సాగు ఖర్చులు అదుపులో ఉంచేందుకు ఎరువుల సబ్సిడీని పెంచవలసి వచ్చిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. డిఎపి 50 కిలోల బస్తా ధరను రూ. 1350 వద్దే స్థిరంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారు. 2026 ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం 3.46 శాతం తగ్గిన నేపథ్యంలో, రాబోయే రబీ సీజన్‌లో గోధుమలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు ఎరువుల కొరత రాకుండా చూడడమే దీని ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం చెబుతోంది. 202627 రబీ సీజన్‌కు సంబంధించి ఎరువుల సబ్సిడీ కోసం కేంద్రం రూ. 62,370కోట్లు కేటాయించడం సంచలనాత్మకమే. 202526 రబీతో పోలిస్తే ఇది ఏకంగా 64% అధికం. 2027 మార్చి 31 వరకు ఈ సబ్సిడీ సదుపాయం ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. గత రబీ సీజన్‌లో ఈ కేటాయింపు రూ. 37,952.29కోట్లు కావడం గమనార్హం.

తాజా సబ్సిడీ పెంపుతో మొత్తం సబ్సిడీ వ్యయం రూ. 3లక్షల కోట్లు దాటే అవకాశం ఉంది. దీనివల్ల దేశ ద్రవ్యలోటు జిడిపిలో 0.3% వరకు పెరిగే అవకాశం ఉందని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ అభిప్రాయపడ్డారు. సబ్సిడీ పెంపుతో వ్యవసాయానికి, రైతులకు ఎంతవరకు ప్రయోజనం కలుగుతుందో నిదానంగా అధ్యయనం చేస్తేనే గానీ తెలియదు. ఈ సందర్భంగా ఎరువుల విధానంలోని సమస్యలు, లోపాలు పరిష్కరించవలసిన అవసరం కూడా కనిపిస్తోంది. 2026 ఖరీఫ్ సీజన్‌లో ఎంపిక చేసిన సరిహద్దు జిల్లాల్లో ఎరువుల అమ్మకాలు 37.56% తగ్గినట్లు వచ్చిన నివేదిక కొంత ఊరటనిచ్చింది. ఎరువుల కొనుగోళ్లకు డిజిటల్ ధ్రువీకరణ విధానాన్ని ప్రవేశ పెట్టిన తరువాతనే ఈ తగ్గుదల నమోదైంది. దీని బట్టి గతంలో పెద్ద మొత్తంలో సబ్సిడీ ఎరువులు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోంది. తక్కువ ధరకు రైతులకు అందించే యూరియా ఎరువులు కొంతమంది అక్రమంగా పారిశ్రామిక అవసరాలకు మళ్లించడం, దేశాల సరిహద్దులు దాటి తరలించడం చాలా కాలంగా ఆందోళన కలిగిస్తోంది. భారతదేశంలో రైతులకు 45 కిలోల యూరియా బస్తా సుమారు రూ. 265 కే అందుబాటులో ఉండగా, అంతర్జాతీయ మార్కెట్ ధరలు, రవాణా ఖర్చులు కలిపి దిగుమతి చేసుకునే యూరియా ధర సెప్టెంబర్ నెల అంచనా ప్రకారం సుమారు రూ. 1674 గా ఉంది. అంటే రైతులకు అందించే ధరకు, అంతర్జాతీయంగా దిగుమతి చేసుకునే ధరకు మధ్య రూ. 1409 వరకు వ్యత్యాసం ఉంది. అంతర్జాతీయ ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వంపై సబ్సిడీ భారం విపరీతంగా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఎరువుల అమ్మకాల వ్యవస్థ (ఫెర్టిలైజర్ సేల్స్‌ఫ్రేమ్‌వర్క్ ఎఫ్ఎఫ్ఎస్)ను అమలు లోకి తీసుకురావడం స్వాగతించదగిన చర్య. ఈ విధానం ద్వారా రైతుల డిజిటల్ గుర్తింపు, తమ భూమి వివరాలు, పంటల వివరాల ఆధారంగా అవసరమైన ఎరువులనే కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనివల్ల ఎరువుల అక్రమ వినియోగాన్ని అరికట్టవచ్చు. ఎరువుల పంపిణీని పర్యవేక్షించవచ్చు. ప్రభుత్వ సబ్సిడీలు దుర్వినియోగం కాకుండా చూడవచ్చు. ప్రభుత్వం డిజిటల్ విధానంద్వారా నిజమైన రైతులను గుర్తించడం మంచిదే. అయితే భూమి సొంతంగా లేని కౌలు రైతులు, ఇతరుల భూమిని సాగుచేసే రైతులు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలి. భూమి పత్రాలు లేవని, లేదా సరిగ్గా లేవని చెప్పి వారికి విత్తనాలు, ఎరువులు వంటి అవసరమైన వ్యవసాయ సహాయాన్ని నిరాకరించకూడదు. రైతులకు సహాయం అందించడంలో భూమి యాజమాన్యం కంటే నిజంగా ఎవరు సాగు చేస్తున్నారో అనే దానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వం డిజిటల్ మౌలిక సదుపాయాలను కేవలం ఎరువులు లావాదేవీలను పర్యవేక్షించడానికి మాత్రమే కాకుండా ఎరువుల సబ్సిడీ విధానాన్ని మరింత హేతుబద్ధంగా, సమర్థవంతంగా మార్చడానికి ఉపయోగించాలి. ఎరువుల ధరలను క్రమంగా సవరించడం, ప్రత్యక్ష నగదు బదిలీ విధానాన్ని మరింత సమర్థవంతంగా రూపొందించడం, రైతులు సమతుల్యంగా వివిధ పోషకాలు కలిగిన ఎరువులను ఉపయోగించేలా ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా ఎరువుల అక్రమ మళ్లింపును, అధిక ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చు. ఎరువుల సబ్సిడీపై ప్రభుత్వం చేసే ఖర్చులో ఆదా అయిన మొత్తాన్ని ఆర్థిక అభివృద్ధికి దోహదపడే మౌలిక సదుపాయాలు, ఆస్తుల కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాలపై ఎక్కువగా ఖర్చు చేయవచ్చు.

దేవరకద్రకు బ్రహ్మోస్ పరిశ్రమ వరం.. అభివృద్ధికి కొత్త దిశ





-416 ఎకరాల భూసేకరణ పూర్తి.. 82 మంది రైతులకు రూ.32 కోట్ల పరిహారం పంపిణీ

-ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం -- ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 13 మహాప్రభ

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. దేశ రక్షణ రంగానికి ప్రతిష్ఠాత్మకంగా నిలవనున్న బ్రహ్మోస్ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి వెల్లడించారు. జినుగురాల బస్వాయపల్లి గ్రామాల పరిధిలో మొత్తం 416 ఎకరాల భూమిని సేకరించగా, భూములు కోల్పోతున్న 82 మంది రైతులకు రూ.32 కోట్ల పరిహారాన్ని పంపిణీ చేశారు. ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

శుక్రవారం దేవరకద్ర మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన డీఆర్‌డీఎల్ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ) భూసేకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు పరిహారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవరకద్ర నియోజకవర్గంలో ఏర్పాటు కానున్న బ్రహ్మోస్ పరిశ్రమ మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిలో చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రాంత ఆర్థికాభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు రైతుల భూములో వేసిన బోర్లు పైపులైనులకు అధికారులు పరిశీలించి పరిహారమిస్తామని ఎమ్మెల్యే అన్నారు. దేవరకద్రకు ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన బ్రహ్మోస్ ప్రాజెక్టును కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సహకారంతో ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ విజయవంతంగా పూర్తయిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షుడు భూనేటి అంజిల్ రెడ్డి, దేవరకద్ర పీఏసీఎస్ చైర్మన్ అరవింద్ కుమార్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, తహసీల్దార్ మహమ్మద్ హర్షద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, బస్వాయపల్లి సర్పంచ్ శివకుమార్స జీనుగురాల సర్పంచ్ నాగమ్మ సాయిలు , దేవరకద్ర కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ కురువ బీరప్ప అరుణా చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యునిగా ఆర్.టి.ఐ.ఎ.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్

దేవరకొండ నవంబర్ 13(మహా ప్రభ)

నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం (ఆర్.టి ఐ.) అమలును మరింత పకడ్బందీగా పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ బి. చంద్రశేఖర్, ఐ.ఏ.ఎస్. అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీకి నామినేట్ చేయడం జరుగుతుంది.

ఇందులో భాగంగా వివిధ రెవెన్యూ డివిజనల్ అధికారుల (ఆర్.డి.ఓ) ప్రతిపాదనలను పరిశీలించి, నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రొసీడెంఛియల్ నెం. ఎ5/11318/2016-2026 ద్వారా రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్టివిస్ట్ సొసైటీ (ఆర్.టి ఐ ఎ.ఎస్.) రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ (తండ్రి: భద్రు, నివాసం: హెచ్.నెం. 6-23, గూండ్లపల్లి మండలం, కొత్తతండా గ్రామం) ఈ కమిటీ సభ్యునిగా ఎన్నిక కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు, ఆర్.టి.ఐ.ఎ.ఎస్. కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా డా. కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టం--2005ను



ప్రభుత్వ కార్యాలయాల్లో పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం--2005కు సంబంధించిన బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాలయాల నోటీసు బోర్డులపై, అలాగే ఇతర అందుబాటులో ఉన్న ప్రచార మాధ్యమాల ద్వారా స్వచ్ఛందంగా వెల్లడించాలని సూచించారు. ప్రజలు సమాచారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని అన్నారు. ప్రభుత్వ విధివిధానాలు, అధికారుల బాధ్యతలు, ప్రజలకు అందించే సేవలు, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలు సులభంగా తెలుసుకునే విధంగా పారదర్శక పాలనకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమాచార హక్కు చట్టంలోని నిబంధనలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజల్లో ఈ చట్టంపై మరింత అవగాహన కల్పించేందుకు ఆర్.టి ఐ.ఎ.ఎస్. సంస్థ తరఫున నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

తనకు జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీలో సభ్యునిగా అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ బి. చంద్రశేఖర్, ఐ.ఏ.ఎస్. కి డా. కొర్ర కిషన్ నాయక్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

-డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలి.

-మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్

మెదక్ జిల్లా -13నవంబర్ (మహాప్రభ).

మెదక్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసులతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ప్రతి కేసులో పక్కా సాక్ష్యాధారాలు సేకరించి, సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేయాలని, దర్యాప్తు పూర్తి చేసి సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసుల్లో బాధితుల ఆచూకీ గుర్తించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని, ఎన్‌బీడబ్ల్యూ కేసుల్లో వారెంట్ల అమలుపై



ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తనిఖీల్లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించి విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని, ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో పోలీసు నిఘా పెంచాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన 34 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, రమేష్, వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో ప్రమాదవశాత్తు మంటలు.. సంగీత ఉపాధ్యాయురాలు (55)ఏళ్ల లక్ష్మి మృతి

శేరిలింగంపల్లి, (నవంబర్ 13) మహా ప్రభ

చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 09.11.2026 నాడు సాయంత్రం సుమారు 18:45 గంటల సమయంలో వచ్చిన ఫిర్యాదు మేరకు త్రిషాల సఫ్రాన్ నల్లగండ్ల లో నివసిస్తున్న ఫిర్యాదురాలు హరిచందన్ తన రూమ్ లో ఉండగా, అతని తల్లి అయిన బి. లక్ష్మి భర్త శేషాచార్యులు,(55) వృత్తి: సంగీత అధ్యాపకురాలు, హాల్‌లో నుండి కేకలు వేయడం, వెంటనే హాల్‌లోకి వెళ్లి చూడగా, తన తల్లికి తీవ్రంగా కాలిన గాయాలు అయి ఉండటాన్ని గమనించారు. బయటికి వెళ్లి చూసేవరకు ఇంటి కారిడార్‌లో దీపం వెలిగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని తనకు కాలిన గాయాలైనట్లు ఆమె తెలిపింది. వెంటనే అక్కడికి వచ్చిన



పొరుగువారు ఆమెపై నీళ్లు పోసి, దుప్పటి కప్పి మంటలను ఆర్పారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం సిటిజన్స్ ఆసుపత్రికి తరలించగా, ఆసుపత్రిలో చేర్చిన సమయంలో ఆమె స్పృహలోనే ఉన్నారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం వెంటిలేటర్ సహాయంతో బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండగా, 13.11.2026 నాడు ఆమెకు అయిన తీవ్ర కాలిన గాయాల కారణంగా మృతి చెందారనీ తెలిపారని ఈ సంఘటనపై సంబంధించి బాధితురాలు చికిత్స పొందుతూ మరణించినందున, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందానగర్ పోలీసులు తెలిపారు.

1,150 మందికి కొత్త చేయూత పింఛన్లు

దేవరకొండ డివిజన్ నవంబర్ 13 (మహాప్రభ)
పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదు -- ఎమ్మెల్యే బాలు నాయక్.గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో పేదలకు ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు.చేయనిబీఆర్ఎస్ పాలకులు,నేడు ప్రజల సంక్షేమం.గురించిమాట్లాడటం విడ్డూరంగా ఉందని దేవరకొండఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్ విమర్శించారు. శుక్రవారం దేవరకొండ పట్టణం, సాయి శివ ఫంక్షన్ హాల్లోదేవరకొండమండలానికి చెందిన 1,150 మంది లబ్ధిదారులకు నూతన చేయూతపింఛన్లమంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలు,వృద్ధులు, వితంతువులు,దివ్యాంగులు పింఛన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, ప్రజలకు ఇచ్చినహామీలనునెరవేర్చడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజల కష్టాలనుగుర్తించిఅధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల



రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు.గత పాలకులు పదేళ్లలోచేయలేనిపనులను ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని అన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టడం కాకుండా, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ సంకల్పమని, దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలు నాయక్ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలోసంబంధిత అధికారులతో పాటు మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహా, హనుమంతు వెంకటేష్ గౌడ్,పట్టణకాంగ్రెస్అధ్యక్షుడు మహ్మద్ రయీస్, మండల అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, దూదిపాల వేణుధర్ రెడ్డి, లోకసాని శ్రీధర్ రెడ్డి, కొర్ర రాంసింగ్ నాయక్, పట్టణ కౌన్సిలర్లు, మండల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ నాయకులు



పెద్దవంగర నవంబర్ 13 (మహాప్రభ)
మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు పెద్దవంగర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు నక్కనబోయిన రజిత-- వీరన్న యాదవ్ దంపతుల కుమార్తె సింధు, ప్రశాంత్ యాదవ్‌ల వివాహ వేడుకకు బీఆర్ఎస్ పెద్దవంగర మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య హాజరయ్యారు. పాలకుర్తి మండల కేంద్రంలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, మండల నాయకులు శ్రీరాం సుధీర్, మాజీ ఎంపీటీసీ పసులేటి వెంకటరామయ్య, పాక్స్ డైరెక్టర్ అనపురం రవి, బొమ్మకల్ గ్రామ పార్టీ అధ్యక్షుడు రెడ్డబోయిన గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ శ్రీరాం పురుషోత్తం, రాంపాక నారాయణ, బారి వెంకటనారాయణ, మందపురి సతీష్, ఎర్రసాని సమ్మయ్య, రాయరపు స్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆశీస్సులు



దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 13 మహాప్రభ
మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర మండలం డోకూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త నేతుల చిన్నప్ప కుమారుడు నేతుల రాజ్‌కుమార్ వివాహ వేడుకకు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ డోకూర్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆశన్నతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

రాములమ్మ మృతదేహానికి ఎమ్మెల్యే బాలు నాయక్ నివాళులు



దేవరకొండ డివిజన్ నవంబర్ 13 (మహాప్రభ)
నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, శుక్రవారం మాజీ ఎంపీటీసీ పొట్టెపాక మురళీకృష్ణ తల్లి పొట్టెపాక రాములమ్మ మరణించిన విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వారి స్వగృహానికి చేరుకుని రాములమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికితనప్రగాఢసానుభూతిని తెలియజేశారు. ఈ విషాదసమయంలోకుటుంబ సభ్యులకు మనోధైర్యంగా ఉండాలని, రాములమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోతి యుగంధర్ రెడ్డి, లోకసాని కృష్ణయ్య, గిరి యాదయ్య, పులికంటి సుధాకర్, కేతావత్ హేమ్లా, నకిరేకంటి రజినీకుమార్, ఇంద్రావత్ శ్రీను, కొప్పుల సురేందర్ రెడ్డి, కేతావత్ కిషన్, రామావత్ మోహన్, నియోజకవర్గానికి చెందిన రేషన్ డీలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా .. నియామకం



పాపన్నపేట, నవంబర్ 13(మహాప్రభ)
మెదక్ జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షుడిగా పాపన్నపేటకు చెందిన దూదేకుల సద్దాంహుస్సేన్ ను నియమించారు. దూదేకుల నూర్ బాషా సంఘం జాతీయ అధ్యక్షుడు షేక్ సత్తార్ సాహెబ్ నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య...



పాపన్నపేట నవంబర్13(మహాప్రభ)
ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన బాలనింగని సాయిలు(37) కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసై సరిగా పని చేయడం లేదు.రోజు మద్యం సేవించి ఇంటికి వచ్చేవాడు.ఈ విషయంలో దంపతుల మధ్య చిన్నపాటి గొడవలు జరుగుతుండేవి.ఈనెల 10న భార్య మమతను తిట్టడంతో ఆమె వారి పుట్టింటికి వెళ్లిపోయింది.అదే రోజు మధ్యాహ్నం సమయంలో సాయిలు, మమత ఇటీవల ఓ వద్ద పని చేయగా అక్కడ కూలీ డబ్బులతో సైతం మద్యం సేవించాడు.దీంతో భార్య అతనికి ఫోన్ చేసి ఇలా మద్యం తాగితే ఎలా మద్యం తాగడం మానుకో అని చెప్పగా భార్యను తిట్టి ఫోన్ పెట్టేశాడు.ఈ క్రమంలో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.గురువారం సాయిలుకు భార్య ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో చుట్టూ పక్కల వారు వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి భార్య ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లక్ష్మీపల్లిలో గృహప్రవేశ వేడుకకు హాజరైన హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి

-సరోజ్ రెడ్డికి ఘన స్వాగతం..
శాలువాతో సత్కరించి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు



దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 13 మహాప్రభ
: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి గ్రామంలో పెద్దమోని అభిషేక్ సోదరుడు రామకృష్ణ నూతన గృహప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించారు.
ఈ శుభకార్యానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సరోజ్ రెడ్డి కి ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం నిర్వహించిన గృహప్రవేశ పూజా కార్యక్రమంలో మందడి సరోజ్ రెడ్డి పాల్గొని నూతన దంపతులు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సందడిగా సాగింది. సరోజ్ రెడ్డి రాకతో గృహప్రవేశ వేడుకకు మరింత ప్రత్యేకత చేకూరింది.

కర్నె ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి.



మెదక్ జిల్లా -13నవంబర్ (మహాప్రభ).
సరస్వతి కాన్వెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ కర్నె ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి శుక్రవారం మెదక్ పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభాకర్ సతీమణి సుమిత్రాదేవితో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభాకర్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఆయన మరణం బాధాకరమని, కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.వీరి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసిరెడ్డి మాణిక్య రెడ్డి, జైపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సలాం భాయ్, ఏనుగు రాజు, నాయకులు మాయ మల్లేశం, సాయి, కిరణ్ గౌడ్, తలారి సంతు, ముజీబ్, వడ్ల నాగరాజు, జిల్లా నాయకులు, శంకరంపేట మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్, బొద్దుల ప్రభాకర్, లక్ష్మణ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

దేవరకొండ పట్టణంలోని 9వ వార్డులో 11 మందికి నూతన చేయూత పెన్షన్లు మంజూరు.



దేవరకొండ డివిజన్ నవంబర్ 11 (మహాప్రభ)
దేవరకొండ పట్టణంలోని సాయి శివ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 9వ వార్డుకు చెందిన 11 మంది లబ్ధిదారులకు నూతనంగా చేయూతపెన్షన్లుమంజూరయ్యాయి.ఈ సందర్భంగా లబ్ధిదారులకుసంబంధించిన ధృవీకరణ పత్రాలను 9వ వార్డు కౌన్సిలర్ ముత్యాల చంద్రకళ రవికుమార్ యాదవ్ అందజేశారు.

రాములమ్మ మృతదేహానికి డాక్టర్ యేకుల రాజారావు నివాళులు



దేవరకొండ, నవంబర్ 13(మహాప్రభ)
: నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పొట్టెపాక మురళీకృష్ణ తల్లి పొట్టెపాక రాములమ్మ మృతి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యేకుల రాజారావు వారి స్వగృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాములమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, రాములమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

మాజీ ఎమ్మెల్యే కు ఆహ్వానం



పాపన్నపేట, నవంబర్ 13(మహాప్రభ)
కుర్తివాడ గ్రామానికి చెందిన జర్నలిస్టు మధుసూదన్ చారి శోభారాణి దంపతుల కుమార్తె వైష్ణవి వివాహం సురేష్ చారితో ఈ నెల 21 న కొత్తపల్లి అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్ లో జరగనుంది. ఈసందర్భంగా జర్నలిస్టు మధుసూదన్ మెదక్ మాజీ ఎమ్మెల్యే,భారాస జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. వివాహ పత్రికను ఆమెకు అందజేసి,ఈ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. నాయకులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమైతే భారీ ప్రోత్సాహకాలు.

-జనాభా ప్రాతిపదికన రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నగదు ప్రోత్సాహకం.
-గ్రామాల్లో సామరస్యం, ఐక్యత, సమష్టి భాగస్వామ్యంతో కూడిన పాలనకు ప్రోత్సాహం.
-ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకే ప్రభుత్వ ప్రోత్సాహకం వర్తింపు.
-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



నంద్యాల నవంబర్ 13 (మహాప్రభ):
గ్రామాల్లో సామరస్యం, ఐక్యత, పరస్పర సహకార భావనను పెంపొందించి, ఎన్నికల సమయంలో తలెత్తే వర్గ విభేదాలు, వివాదాలను తగ్గించడంతో పాటు ఏకాభిప్రాయంతో కూడిన స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందించే ఏకగ్రీవ ఎన్నికల ప్రోత్సాహక నగదును గణనీయంగా పెంచిందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు గ్రామ పంచాయతీలోని అన్ని వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన పెంచిన ప్రోత్సాహక మొత్తాలను అందించాలని ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి. నెం.1111 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు.

పెంచిన ప్రోత్సాహక నగదు వివరాలు:
1)5,000 వరకు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ. 15 లక్షలు.
2)5,001 నుంచి 10,000 వరకు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ. 25 లక్షలు.
3)10,000కు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ. 50 లక్షలు.

గతంలో 2,000 కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ. 5 లక్షలు, 2,001 నుంచి 5,000 వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ. 10 లక్షలు, 5,001 నుంచి 10,000 వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ. 15 లక్షలు, 10,000కు పైగా జనాభా కలిగిన పంచాయతీలకు రూ. 20 లక్షల చొప్పున ప్రోత్సాహకం అందించేవారని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ మొత్తాలను పెంచుతూ నూతన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

ప్రోత్సాహకానికి వర్తించే నిబంధనలు:
సర్పంచ్ పదవితో పాటు గ్రామ పంచాయతీలోని అన్ని వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు సంబంధిత చట్టాలు, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించిన గ్రామ పంచాయతీలకు మాత్రమే ఈ ప్రోత్సాహకం వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. నగదు విడుదలకు ముందు సంబంధిత అధికారులు ఆయా గ్రామ పంచాయతీల అర్హతను పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంటుందన్నారు.

ప్రభుత్వం మంజూరు చేసే ప్రోత్సాహక మొత్తాన్ని సంబంధిత గ్రామ పంచాయతీల పరిధిలో ఆమోదించిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకే వినియోగించాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించి నిర్దేశించిన ఆర్థిక, లెక్కల నిర్వహణ, ఆడిట్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ తెలిపారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పదవీకాలంలో ఈ మొత్తాన్ని దశలవారీగా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఎన్నికల్లో పోటీ చేసే చట్టబద్ధమైన హక్కు ఉంటుందని, ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, స్వతంత్రంగా వినియోగించుకునే హక్కుకు ఈ పథకం ఎలాంటి భంగం కలిగించదని స్పష్టం చేశారు.

గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి
ఏకగ్రీవ ఎన్నికల ద్వారా లభించే ప్రోత్సాహకాలపై గ్రామ పంచాయతీలు, గ్రామ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీల వివరాలను జనాభా వర్గాల వారీగా సేకరించి, అవసరమైన ఆర్థిక నిధుల అంచనాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు సమర్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ ప్రోత్సాహక పథకం 2026 సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలకు మాత్రమే వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

-స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేసిన జిల్లా అధ్యక్షుడు





గాంధారి: నవంబర్ 13 (మహాప్రభ)
భారతీయ జనతా పార్టీ గాంధారి మండల శాఖ కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు ఈకే మధుసూదన్ రావు గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను గెలుచుకోవడానికి కార్యకర్తలను, నాయకులను సంసిద్ధం చేయాలని సీనియర్ నాయకులకు సూచించారు.అదేవిధంగా ఐదు బూతులకు ఒక ఇన్ చార్జిని నియమించాలని, వాళ్లు బూత్ స్థాయిలో కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గాంధారి మండల శాఖ అన్ని మోర్చాల అధ్యక్షులను నియమించాలని మండల అధ్యక్షుడు సీనియర్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పోతంగల్ కిషన్ రావు, మాజీ మండల అధ్యక్షుడు సాయిబాబా, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సీనియర్ నాయకులు సాయి గౌడ్, మాణిక్ రావు, హుస్సేన్, సంజు, తిమ్మాపూర్ సర్పంచ్ సంజీవులు, రమేష్, మండల ప్రధాన కార్యదర్శి రాంసింగ్, సతీష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సంజీవులు, నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

చీరను కత్తిరించి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న బీసీ సిబ్బంది రమేష్, హోంగార్డు మైసయ్య



మెదక్, వెల్దుర్తి, నవంబర్, 13,(మహాప్రభ)
కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించగా, సకాలంలో స్పందించిన పోలీసులు అప్రమత్తతతో అతడి ప్రాణాలను కాపాడారు.వివరాల్లోకి వెళితే.. మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలో సంతోష్ అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా ఇంట్లో తలుపులు వేసుకొని ఉరివేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ ఘటనపై డయల్ 112కు సమాచారం అందడంతో వెంటనే స్పందించిన బీసీ సిబ్బంది రమేష్, హోంగార్డు మైసయ్య హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు.ఇంట్లో ఉరివేసుకున్న స్థితిలో ఉన్న సంతోష్‌ను గమనించిన పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమయస్ఫూర్తితో చీరను కత్తిరించి అతడిని కిందకు దించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. అనంతరం అతడికి అవసరమైన వైద్య సహాయం అందించేందుకు చర్యలు చేపట్టారు.సమయానికి స్పందించి, ఎంతో అప్రమత్తతతో ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన బీసీ సిబ్బంది రమేష్, హోంగార్డు మైసయ్యల సేవలను స్థానికులు అభినందించారు. పోలీసుల తక్షణ స్పందన, మానవీయతపై హర్షం వ్యక్తం చేశారు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన..

ప్రత్యామ్నాయ పంటల సాగుపై సూచనలు!



శివ్వంపేట, నవంబర్ 13 (మహాప్రభ):
మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గంగాయిపల్లి లో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, వర్షపాతం తగ్గే అవకాశాలు, నీటి కొరత వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు మెదక్ జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోంది. ఈ సందర్భంగా ఎం పి ఓ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి సమస్య ఏర్పడింది కాబట్టి రానున్న రోజుల్లో కరెంట్ కొరత వచ్చే అవకాశం ఉంది కాబట్టి ప్రజలంతా నీటిని కరెంటును చాలా పొదుపుగా వాడాలన్నారు అదేవిధంగా రైతులకు గల ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు కార్యక్రమాల్లో భాగంగా రైతులకు తక్కువ నీటితో సాగు చేసుకునే ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, వర్షాభావ పరిస్థితులను తట్టుకునే పంటల సాగు పద్ధతులు, వర్షపు నీటి సంరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించుకునే విధానాలపై అవగాహన కల్పించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ సవాళ్లను అధిగమించేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, నీటి సంరక్షణతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ పిలుపునిస్తోంది. ఈ కార్యక్రమం లో ఎం పి ఓ తిరుపతి రెడ్డి ఏ ఓలావణ్య,రవివర్మ, మరియు సర్పంచ్ రావేల్లి సాయిలు ఉప సర్పంచ్ తాటి పవన్ కుమార్ గుప్తా, వార్డు మెంబర్లు గ్రామస్థులు పాల్గొన్నారు

బాల అకాడమీలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు.

నంద్యాల నవంబర్ 13 (మహాప్రభ):
బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల అకాడమీ పాఠశాలలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించే లక్ష్యంతో పలు సాంస్కృతిక, సృజనాత్మక, క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా నవనంది రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్లో సైక్లింగ్ పోటీలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో ఎనిమిదవ తరగతికి చెందిన జునైద్ ప్రథమ స్థానంలో నిలిచి సైకిల్‌ను బహుమతిగా గెలుచుకున్నాడు. ఏడవ తరగతికి చెందిన సఫియా ద్వితీయ స్థానాన్ని సాధించింది. విజేతలకు నవనంది రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ విక్రమ్ గారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు 30 శాతం రాయితీతో కూడిన 150 కూపన్లను అందించడం జరిగింది. అదేవిధంగా బాల అకాడమీలో విద్యనభ్యసించి, పవర్ లిఫ్టింగ్ క్రీడలో జాతీయ స్థాయికి ఎదిగి ఎన్నో బంగారు పతకాలను సాధిస్తున్న పూర్వ విద్యార్థిని కుమారి పల్లవిని పాఠశాల





యాజమాన్యం ఘనంగా సన్మానించింది. విద్యార్థి దశలోనే తన ప్రతిభతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పాఠశాలకు గర్వకారణమని, ఆమె సాధించిన విజయాలు నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఇదే సందర్భంగా విద్యారంగంలో విశేషమైన సేవలు అందిస్తూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న బాల అకాడమీ కరస్పాండెంట్ మాధవి లత కి ప్రగతి రత్న, కీర్తి రత్న అవార్డులు లభించడం పాఠశాలకు ఎంతో గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆమెను ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేసింది. మరోవైపు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసే ఉద్దేశంతో ఎస్బిఐ లైఫ్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రవి కిండర్ గార్డెన్ కరస్పాండెంట్ సర్ సుబ్రహ్మణ్యం గారు పాల్గొని పాఠశాల అభివృద్ధికి విశేషమైన కృషిచేసి ప్రగతిరత్న మరియు కీర్తిరత్న అవార్డులను అందుకున్న బాల అకాడమీ కరస్పాండెంట్ మేడం మాధవి లత గారిని ఘనంగా సత్కరించడం జరిగింది. విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలగాలని వారు కన్న కలలు నిజం చేసుకునే ప్రయత్నంలో కృషిని కొనసాగించాలని విద్యార్థులందరికీ చక్కటి సందేశాన్ని అందించారు.

బాలల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న 51వ వార్డు కౌన్సిలర్ తాటికొండ విజయ దంపతులు.

నంద్యాల
నవంబర్ 13 (మహాప్రభ):
నంద్యాల పట్టణంలోని స్థానిక 51వ వార్డు నందమూరి నగర్ నందు గల ప్రాథమిక ఉర్దూ ఉన్నత పాఠశాల నందు బాలల దినోత్సవం 14వ తేదీ రెండవ శనివారం సెలవు దినం కావడం వలన ఒకరోజు ముందుగా ఏర్పాటు చేయడం జరిగింది . ఈ కార్యక్రమునకు వార్డు కౌన్సిలర్ తాటికొండ విజయ, తాటికొండ మహేష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ విజయ మాట్లాడుతూ కౌన్సిలర్ గా గెలుపొందిన తర్వాత మొట్టమొదటిసారిగా బాలల దినోత్సవం సందర్భంగా నందమూరి నగర్ లోని ప్రాథమిక ఉర్దూ ఉన్నత పాఠశాల నందు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆమె అన్నారు. భారతదేశ మొట్టమొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం రోజున బాలల దినోత్సవం జరపడం ఆయనకు పిల్లలపై ఎక్కువ ప్రేమ అభిమానం మక్కువ వలన ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుందని ఆమె అన్నారు. అదేవిధంగా బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఆటల పోటీలో పాల్గొని విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులకు కౌన్సిలర్ విజయ దంపతుల చేతుల మీదుగా వారికి బహుమానాలు అందజేయడం జరిగిందని వారు అన్నారు. మొట్టమొదటిసారి ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు విచ్చేసిన కౌన్సిలర్ విజయ దంపతులకు పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ జానీ భాష, ఖలీలుల్లా, శమీమ్ భేగం, రేష్మ ఖాతున్,మస్తాన్ వలి, శభాన,హనీఫ్, హలీమున్నీసా,అమీన అంజూమ్ తదితర పాఠశాల సిబ్బంది మరియు పాఠశాల కమిటీ చైర్మన్ అమీర్ భాష,మాజీ కమిటీ చైర్మన్ పర్వీన్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



శ్రీశైలంలో భక్తి పారవశ్యంతో సంప్రదాయ నృత్య ప్రదర్శనలు

శ్రీశైలం, నవంబర్ 13 (మహాప్రభ):
శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళారాధన వేదికపై శుక్రవారం సంప్రదాయ నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. మంగళగిరి, గుంటూరు జిల్లాకు చెందిన నాట్యమయూరి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ కళాకారులు ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై తమ నృత్య ప్రదర్శనతో అలరించారు. ఈ కార్యక్రమంలో వినాయక ప్రార్థన, ఓం నమశ్శివాయ, శివాష్టకం, కాలభైరవాష్టకం, శంభో.. శివశంభో తదితర భక్తిగీతాలు, అష్టకాలకు మధురిమ, హేమ, తేజ, చేతన, కృత్తిక, లావణ్య, పావని తదితర కళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. భక్తి భావంతో సాగిన ఈ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శ్రీశైల దేవస్థానం నిత్యకళారాధనలో భాగంగా ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. శ్రీశైల స్వామిఅమ్మవార్ల కైంకర్యాలు సంపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళలను పరిరక్షించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను కొనసాగిస్తోంది.



పాతాళగంగ వద్ద కృష్ణమ్మ హారతికి ప్రత్యక్ష వ్యాఖ్యానం
కార్తీకమాసోత్సవాల్లో భాగంగా పాతాళగంగ వద్ద నిర్వహించిన కృష్ణమ్మ హారతి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా ప్రత్యక్ష వ్యాఖ్యానం ఏర్పాటు చేశారు. నవంబరు 10 నుంచి డిసెంబరు 9 వరకు నిర్వహిస్తున్న కార్తీకమాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం జరిగిన కృష్ణమ్మ హారతి సందర్భంగా నంద్యాలకు చెందిన డా. డి. హయగ్రీవాచార్యులు ప్రత్యక్ష వ్యాఖ్యానం అందించారు. భక్తిభావాన్ని పెంపొందించేలా నిర్వహించిన ఈ కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక అనుభూతికి చేరువ చేశాయి.

బిజినెస్

భారీగా తగ్గిన బంగారం ధరలు

- హైదరాబాద్ బులియన్ మార్కెట్లో కొనసాగుతున్న ధరల పతనం
- 24 క్యారెట్ల 10 గ్రాములపై ఒక్కరోజే రూ.1,310 తగ్గింపు
- రూ.1,38,490కి చేరిన పసిడి ధర
- నాలుగు రోజుల్లో మొత్తం రూ.6,110 మేర తగ్గుదల
- 22 క్యారెట్ల 10 గ్రాముల ధరలో రూ.1,200 కోత
- రూ.1,26,950కి చేరిన 22 క్యారెట్ల బంగారం
- కిలో వెండి ధరలో మాత్రం ఎలాంటి మార్పులేదు
- బంగారం ధరలకు అదనంగా 3 శాతం జీఎస్టీ



హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు కొనుగోలుదారులకు ఊరటనిస్తున్నాయి. పసిడి ధరలు వరుసగా నాలుగో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, బులియన్ మార్కెట్లో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో బంగారం ధరల్లో తగ్గుదల నమోదవుతోంది. తాజాగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,310 తగ్గి రూ.1,38,490కి చేరింది. గత నాలుగు రోజుల్లోనే మొత్తం రూ.6,110 మేర తగ్గడం గమనార్హం. ఇక ఆభరణాల తయారీలో ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర కూడా దిగివచ్చింది. 10 గ్రాములపై రూ.1,200 తగ్గడంతో ప్రస్తుతం రూ.1,26,950 వద్ద కొనసాగుతోంది. వరుసగా నాలుగు రోజులుగా ధరలు తగ్గుతుండటంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభిస్తోంది. ముఖ్యంగా పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం ఆభరణాలు కొనుగోలు చేయాలని భావిస్తున్నవారు ధరల తగ్గుదలను ఆసక్తిగా గమనిస్తున్నారు. మరోవైపు వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,00,000 వద్ద ఎలాంటి మార్పు లేకుండా ఉంది. బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ వెండి ధరలో మాత్రం కదలిక కనిపించలేదు. ఈ ధరలకు అదనంగా 3 శాతం జీఎస్టీ వర్తిస్తుంది. అలాగే ఆభరణాల కొనుగోలుపై తయారీ ఛార్జీలు ఇతర పన్నులు అదనంగా ఉండవచ్చు. హైదరాబాద్‌తో పాటు ప్రాంతాలను బట్టి బులియన్ ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు నమోదయ్యే అవకాశం ఉంది. మొత్తంగా నాలుగు రోజులుగా కొనసాగుతున్న బంగారం ధరల పతనం పసిడి కొనుగోలుదారుల్లో ఆసక్తిని పెంచుతోంది.

మైక్రోసాఫ్ట్ 365 సేవల్లో అంతరాయం..

-5 గంటలు స్తంభించిన వివిధ అప్లికేషన్లు



న్యూయార్క్:
మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. మైక్రోసాఫ్ట్ 365 కింద పనిచేసే వివిధ అప్లికేషన్లు మొరాయించాయి. గురువారం సుమారు 5 గంటల పాటు ఔట్‌లుక్, టీమ్స్‌తో పాటు ఇతర కొన్ని అప్లికేషన్లు స్తంభించిపోయాయి. దీంతో వేలాది మంది మైక్రోసాఫ్ట్ 365 అప్లికేషన్ యూజర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓపెన్‌ఏఐతో పాటు ఆంథ్రోపిక్ సేవలకు కూడా మైక్రోసాఫ్ట్ వల్ల అవరోధాలు కలిగాయి. అయితే సేవలు నిలిచిపోయిన సర్వర్లను రిస్టోర్ చేసేందుకు మైక్రోసాఫ్ట్ వర్క్ చేస్తున్నట్లు తెలిసింది. యూజర్లు మెల్లమెల్లగా తమ సర్వీసులకు కనెక్ట్ అవుతున్నారని కంపెనీ తాజాగా తన రిపోర్టులో చెప్పింది. డౌన్‌డిటెక్టర్ ప్రకారం .. ఔట్‌లుక్ సేవల్లో గురువారం మధ్యాహ్నం తీవ్ర స్థాయిలో అంతరాయం ఏర్పడినట్లు తెలిసింది. అయితే సాయంత్రం వరకు ఆ సమస్య తగ్గింది.మైక్రోసాఫ్ట్ 365కి సంబంధించిన ఇష్యూలు అన్నీ నిన్న సాయంత్రం వరకు గణనీయంగా తగ్గినట్లు కంపెనీ చెప్పింది. టీమ్స్‌ను యాక్సెస్ చేసేందుకు కూడా యూజర్లకు కొంత సమయం పట్టింది. సర్వర్లపై ఒకేసారి అధిక లోడు పడడం వల్ల సేవల్లో అవరోధాలు ఎదురైనట్లు మైక్రోసాఫ్ట్ చెప్పింది. మైక్రోసాఫ్ట్ 365 సర్వీసుల్లో సమస్యలు ఎదుర్కొంటున్న యూజర్ల రిపోర్టులపై దర్యాప్తు చేస్తున్నట్లు కంపెనీ పేర్కొన్నది. ప్రభావానికి గురైన సర్వర్లను మళ్లీ ఆన్‌లైన్‌లోకి తెచ్చే ఏర్పాట్లు జరుగుతున్నట్లు కంపెనీ వెల్లడించింది. కెపాసిటీని రిస్టోర్ చేశామని, యూజర్లు నెమ్మదిగా రికవరీ అవుతారని మైక్రోసాఫ్ట్ తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నది.

మొబైల్ టారిఫ్‌లు పెంచాల్సిందే.. ఎయిర్‌టెల్ అధినేత మిట్టల్



భారత్‌లో మొబైల్ టారిఫ్‌లు పెరగాల్సిన అవసరం ఉందని ఎయిర్‌టెల్ వ్యవస్థాపకుడు సునీల్ భారతీ మిట్టల్ అభిప్రాయపడ్డారు. టెలికాం రంగంలో నెట్‌వర్క్ నిర్వహణ, 5జీ సేవల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారుల నుంచి వచ్చే సగటు ఆదాయం పెరగాలని సూచించారు. ఒక్కో వినియోగదారుడి నుంచి నెలకు సుమారు రూ.350 ఆదాయం రావాలని, అంటే రోజుకు కేవలం రూ.10 నుంచి రూ.12 మాత్రమేనని ఆయన వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మొబైల్ రీఛార్జ్ ప్లాన్ల ద్వారా టెలికాం సంస్థలకు ఆశించిన స్థాయిలో ఆదాయం రావడం లేదని మిట్టల్ అభిప్రాయపడ్డారు. నాణ్యమైన నెట్‌వర్క్ సేవలు అందించడంతోపాటు కొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలంటే నిరంతరం పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా 5జీ నెట్‌వర్క్ విస్తరణ, టవర్ల ఏర్పాటు, నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. చైనాతో పోలిస్తే భారత్‌లో మొబైల్ టవర్ల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని మిట్టల్ అభిప్రాయపడ్డారు. టెలికాం మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించవచ్చని సూచించారు. ఆయన వ్యాఖ్యలతో భవిష్యత్తులో మొబైల్ రీఛార్జ్ ధరలు మరోసారి పెరిగే అవకాశాలపై చర్చ మొదలైంది. అయితే టారిఫ్‌ల పెంపుపై ఎలాంటి అధికారిక నిర్ణయం వెలువడలేదు.

స్పోర్ట్స్

ఖవాజా ఆరోపణలు శుద్ధ అబద్ధం..
అదంతా చెత్త వాగుడు: పాట్ కమిన్స్

-'శాండ్‌పేపర్' వివాదంపై ఉస్మాన్ ఖవాజా ఆరోపణలను ఖండించిన కమిన్స్
-బాల్ టాంపరింగ్ విషయం జట్టు మొత్తానికి తెలుసనడం వంద శాతం తప్పన్న ఆసీస్ కెప్టెన్
-తన ఆత్మకథతో మాజీ సహచరులపై ఖవాజా చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమన్న కమిన్స్
-ఖవాజా వాదనలను మాజీ కోచ్‌లు తోసిపుచ్చగా, మద్దతుగా నిలిచిన డేవిడ్ వార్నర్
-ఈ వివాదంపై మళ్లీ విచారణ జరిపేది లేదని స్పష్టం చేసిన క్రికెట్ ఆస్ట్రేలియా



ఆస్ట్రేలియా క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా అప్రతిష్ఠ పాలు చేసిన 'శాండ్‌పేపర్ గేట్' వివాదం మరోసారి భగ్గుమంది. రిటైర్డ్ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథలో చేసిన ఆరోపణలపై ఆ జట్టు కెప్టెన్ పాట్ కమిన్స్ తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. బాల్ టాంపరింగ్ కుట్ర గురించి జట్టులోని అందరికీ తెలుసని ఖవాజా చెప్పడం నూటికి నూరు శాతం తప్పని, అదొక శుద్ధ అబద్ధమని కమిన్స్ స్పష్టం చేశాడు. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన కేప్‌టౌన్ టెస్టులో బంతిని దెబ్బతీసేందుకు కొందరు ఆసీస్ ఆటగాళ్లు శాండ్‌పేపర్ వాడటం పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై విచారణ జరిపిన క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ).. డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌లను మాత్రమే దోషులుగా తేల్చి, వారిపై నిషేధం విధించింది. అయితే, తాజాగా విడుదలైన తన ఆత్మకథలో ఖవాజా ఈ వివాదాన్ని మళ్లీ తెరపైకి తెచ్చాడు. బాల్ టాంపరింగ్ కుట్ర జట్టులోని అందరికీ, ముఖ్యంగా బౌలర్లకు కూడా తెలుసని ఆరోపించాడు. ఈ విషయమై తాజాగా మీడియా సమావేశంలో మాట్లాడిన కమిన్స్, ఖవాజా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాడు. "మైదానంలోకి శాండ్‌పేపర్ తీసుకెళుతున్న విషయం మాకు తెలుసని ఆయన అంటే, అది 100 శాతం తప్పు. ఈ మాట నేను గత ఎనిమిదేళ్లుగా చెబుతూనే ఉన్నాను. అంతకంటే తీవ్రంగా, ఈ కుట్రకు నేను, మరికొందరు సూత్రధారులమని ఆయన ఆరోపిస్తున్నారు. ఇది పూర్తిగా నిరాధారమైన చెత్త వాగుడు" అని కమిన్స్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఖవాజా వ్యాఖ్యలకు వార్నర్ మద్దతు తెలుపగా, అప్పటి కోచ్ డారెన్ లీమన్, బ్యాటింగ్ కోచ్ గ్రేమ్ హిక్‌తో పాటు మిచెల్ స్టార్క్ ఈ ఆరోపణలను ఖండించారు. ఖవాజా చాలా తేలికగా, బాధ్యతారహితంగా తమ జీవితాలు, ప్రతిష్ఠతో ఆడుకుంటున్నారని కమిన్స్ ఆవేదన వ్యక్తం చేశాడు. "ఉస్మాన్ నా స్నేహితుడే కావచ్చు, కానీ స్నేహితులు ఒకరి ప్రతిష్ఠను ఇంత తేలికగా తీసుకోరు. ఆయన తన పుస్తకంలో నాపై, జట్టులోని అనేక మందిపై, ఆస్ట్రేలియా క్రికెట్‌పై నిందలు వేశారు" అని అన్నాడు. ఈ వివాదంపై మళ్లీ విచారణ జరపబోమని క్రికెట్ ఆస్ట్రేలియా ఇప్పటికే స్పష్టం చేసింది. 2018 నాటి జట్టులో గెలుపు కోసం కొన్నిసార్లు అహంకారం కనిపించేదని అంగీకరించిన కమిన్స్, కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాక జట్టు సంస్కృతిని పూర్తిగా మార్చానని వివరించాడు.

తనను ఔట్ చేసిన బౌలర్‌కు కోహ్లీ అరుదైన బహుమతి.

మాట్ హెన్రీకి విరాట్ తన జెర్సీని బహుమతిగా ఇచ్చిన కోహ్లీ
నాలుగో వన్డేలో 6 వికెట్లు తీసి భారత్ పతనాన్ని శాసించిన హెన్రీ
తొలి ఓవర్లోనే రోహిత్, కోహ్లీ, శ్రేయస్‌లను డకౌట్
మ్యాచ్ అనంతరం కోహ్లీ అతడిని అభినందించి జెర్సీ అందజేత
తొలి ఓవర్లో బంతి అనూహ్యంగా స్వింగ్ కావడం కలిసొచ్చిందని వెల్లడి



మైదానంలో ప్రత్యర్థులుగా తలపడినా.. ఆట ముగిశాక పరస్పరం గౌరవించుకోవడంలో టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ ఎప్పుడూ ముందుంటాడు. న్యూజిలాండ్‌తో నాలుగో వన్డేలో భారత బ్యాటింగ్ పతనానికి కారణమైన కివీస్ పేసర్ మాట్ హెన్రీకి తన జెర్సీని బహుమతిగా ఇచ్చి మరోసారి క్రీడాస్ఫూర్తిని చాటాడు. మౌంట్ మాంగనూయిలోని బే ఓవల్ వేదికగా శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో హెన్రీ నిప్పులు చెరిగే బంతులతో భారత్‌ను దెబ్బతీశాడు. తన వన్డే కెరీర్‌లోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేస్తూ 27 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్‌లను డకౌట్ చేశాడు. వన్డేల్లో భారత్ తొలి 3 వికెట్లను పరుగులేమీ చేయకుండానే కోల్పోవడం ఇదే తొలిసారి. హెన్రీ బౌలింగ్‌లో నాలుగు బంతులాడి డకౌటైన కోహ్లీ.. మ్యాచ్ అనంతరం అతడిని అభినందించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న హెన్రీని కలిసి తన టీమిండియా జెర్సీని అందించాడు. ఇద్దరూ చిరునవ్వులు చిందిస్తూ మ్యాచ్ గురించి కాసేపు మాట్లాడుకున్నారు. కోహ్లీని హెన్రీ ఐదో బంతికి క్లీన్‌బౌల్డ్ చేశాడు. తొలుత బయటకు వెళ్లేలా బంతులు వేసిన అతడు.. ఆ తర్వాత లోపలికి దూసుకొచ్చే బంతితో కోహ్లీని బోల్తా కొట్టించాడు. అనంతరం శ్రేయస్ అయ్యర్‌ను రివ్యూ ద్వారా ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (27), అక్షర్ పటేల్ (21), నమన్ ధీర్ (21) కొంత పోరాడినా భారత్ లక్ష్యం దిశగా సాగలేకపోయింది. రెండోసారి బౌలింగ్‌కు వచ్చిన హెన్రీ మరో మూడు వికెట్లు పడగొట్టి న్యూజిలాండ్ భారీ విజయానికి బాటలు వేశాడు. మ్యాచ్ అనంతరం హెన్రీ మాట్లాడుతూ.. గాలి బలంగా వీస్తుండడంతో పెద్దగా ప్రయోగాలు చేయకుండా సాధారణంగానే బౌలింగ్ చేశానని చెప్పాడు. కొత్త బంతితో బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టేందుకు కొద్దిసేపు మాత్రమే అవకాశం ఉంటుందని, వికెట్లను లక్ష్యంగా చేసుకుని బౌలింగ్ చేశానని వివరించాడు. తొలి ఓవర్లో బంతి అనూహ్యంగా స్వింగ్ కావడం తనకు కలిసొచ్చిందన్నాడు.

సీఫర్ట్‌పైకి దూసుకెళ్లిన బ్రార్ ..
భారత బౌలర్‌ను నియంత్రించిన కోహ్లీ

మౌంట్ మౌంగనుయి:
కివీస్ బ్యాటర్ టిమ్ సీఫర్ట్, భారత బౌలర్ గుర్నూర్ బ్రార్ మధ్య మాటల యుద్ధం సాగింది. నాలుగో వన్డే లో ఈ ఘటన జరిగింది. సీఫర్ట్ ఔటైన సమయంలో బ్రార్ అతని మీదకు వెళ్లాడు. ఆ సమయంలో కోహ్లీ జోక్యం చేసుకుని భారత బౌలర్‌ను నియంత్రించాడు. ఈ ఘటనకు చెందిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. మౌంట్ మౌంగనుయిలో జరుగుతున్న నాలుగో వన్డేలో టాస్ గెలిచిన ఇండియా తొలుత ఆతిథ్య దేశానికి బ్యాటింగ్ ఇచ్చింది. అయితే ఓపెనర్ సీఫర్ట్ దూకుడుగా ఆడాడు. అతను 48 బంతుల్లో 58 రన్స్ చేశాడు. గుర్నూర్ బ్రార్ వేసిన ఓ ఓవర్‌లో సీఫర్ట్ 14 రన్స్ కొట్టాడు. ఆ టైంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత 12వ ఓవర్‌లో షార్ట్‌పిచ్ బంతిపై సీఫర్ట్ ఫుల్ షాట్ ఆడాడు. బంతి గాలిలోకి ఎగరగా, దాన్ని కీపర్ ఇషాన్ అందుకున్నాడు. అయితే ఔటౌ పెవిలియన్‌కు వెళ్తున్న సీఫర్ట్ మీదుకు బ్రార్ దూసుకెళ్లాడు. ఇక అక్కడే ఉన్న కోహ్లీ అతన్ని నివారించాడు. పరిస్థితులను శాంతింపచేసే ప్రయత్నం చేశాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 333 రన్స్ చేసి ఆలౌట్ అయ్యింది.



త్రిగుణ్ 'జంగా' గ్లింప్స్ విడుదల..

రా అండ్ రస్టిక్ లుక్‌లో అదరగొట్టిన హీరో!



శ్రీమతి వనిత కిలారి సమర్పణలో ఆర్‌కె ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై రమ్య కిలారి, జయచంద్ర నాయుడు కిలారి నిర్మిస్తున్న సరికొత్త చిత్రం 'జంగా'. కెవిన్ గడ్డం (శ్రీహరి) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను ప్రముఖ దర్శకులు రాంగోపాల్ వర్మ తాజాగా విడుదల చేశారు. త్రిగుణ్ కెరీర్‌లో ఇది సరికొత్త మైలురాయిగా నిలవనుందని ఈ గ్లింప్స్ చూస్తే స్పష్టమవుతోంది.ఈ చిత్రంలో త్రిగుణ్ సరసన నేహా పఠాన్ నటించగా, వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్, గగన్ విహారి, చందు గౌడ, సమీర్, నాగ మహేష్, భూపాల్ రాజు, రఘు కారుమంచి, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కొన్ని లక్షల ఏండ్లు పట్టింది.. పశువు మనిషి అవ్వడానికి.. మళ్లీ పశువు అవుతానంటే నేను ఒప్పుకోను.. మనిషి పశువు అయితే.. మరణం వదం అయితాది' అంటూ త్రిగుణ్ చెప్పిన శక్తివంతమైన డైలాగ్స్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నాయి. రా అండ్ రస్టిక్ లుక్‌లో త్రిగుణ్ కనిపిస్తుండగా, మరోవైపు వరలక్ష్మీ శరత్ కుమార్ కూడా పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించి ఆకట్టుకుంటున్నారు. మానవ భావోద్వేగాలు, పుట్టుక-చావుల మధ్య ఉండే సంక్లిష్టతలు, ఆధ్యాత్మిక కోణాలను స్పృశిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు కృష్ణ సౌరభ్ సంగీతం అందిస్తుండగా, వెంకట్ సి. దిలీప్ కెమెరామెన్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రసాద్ వర్మ, ప్రేమ్ రాజ్ మాటలు అందిస్తుండగా, కాసర్ల శ్యాం, పూర్ణాచారి, కళ్యాణ్ చక్రవర్తి పాటలు రాస్తున్నారు. విభిన్న కథాంశంతో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు రానుందనే దానిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.

కీర్తి సురేశ్ 'సత్యవాన్ సావిత్రి' ట్రైలర్ విడుదల..

-లాయర్‌గా అదరగొట్టిన బ్యూటీ!



సౌతిండియా టాలెంటెడ్ హీరోయిన్ కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి' కోసం సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా మరియు ఇంట్రెస్టింగ్ కోర్టు డ్రామాగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. నవంబర్ 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, తాజాగా మేకర్స్ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తూ సినిమాపై భారీ అంచనాలను పెంచేస్తోంది.ఈ ట్రైలర్‌ను గమనిస్తే, కీర్తి సురేశ్ ఇందులో ఒక పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో కనిపించి అదరగొట్టారు. బలవంతంగా వివాహం జరిగినప్పటికీ, హత్య కేసులో అనూహ్యంగా ఇరుక్కున్న తన భర్తను కాపాడుకోవడానికి ఆమె చేసే న్యాయ పోరాటమే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. సీరియస్ కోర్టు రూమ్ డ్రామాతో పాటు కీర్తి సురేశ్ పలికే డైలాగ్స్, ఆమె బాడీ లాంగ్వేజ్ మరియు సినిమాలో ఉండే కామెడీ టైమింగ్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూనే ఆలోచింపజేసేలా ఉన్నాయి. ఒక వైపు భర్తను కాపాడుకోవాల్సిన సవాల్, మరోవైపు కోర్టులో సాగే వాదనలు ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది. ట్రైలర్ కట్‌లోని ప్రతీ సన్నివేశం సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది. నవంబర్ 20న థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడా



17 ఏండ్ల తర్వాత టాలీవుడ్‌లోకి కంగనా రనౌత్..

రవిబాబు దర్శకత్వంలో క్రేజీ హారర్



నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో టాలెంటెడ్ డైరెక్టర్ రవిబాబు దర్శకత్వంలో ఓ హారర్ సినిమా తెరకెక్కుతోంది. 'స్కేరీ పిక్చర్' పేరుతో రానున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై డి. సురేష్ బాబు నిర్మిస్తుండగా, ప్రముఖ హీరో కమ్ ప్రొడ్యూసర్ రానా దగ్గుబాటి కీలక భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు.న్యూఢిల్లీలో జరిగిన 'హారర్‌కాన్ ఇండియా' వేదికగా రానా ఈ సినిమా వివరాలను వెల్లడించగా, తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కంగనా రనౌత్ చివరిసారిగా 2009లో ప్రభాస్ సరసన పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఏక్ నిరంజన్' చిత్రంలో నటించారు. సరిగ్గా 17 ఏళ్ల తర్వాత ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండటంతో ఇది టాలీవుడ్‌లోకి ఆమె రీఎంట్రీగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఇది ప్రముఖ తెలుగు దర్శకుడు రవిబాబు తెరకెక్కిస్తున్న హిందీ చిత్రంగా తెలుస్తోంది. ఈ సినిమా ద్వారా రవిబాబు కూడా బాలీవుడ్ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. విభిన్నమైన హారర్, థ్రిల్లర్ చిత్రాలు తీయడంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న రవిబాబు దర్శకత్వంలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను 2027లో థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

అప్పుడు వాళ్ల కాళ్లు పట్టుకున్నానని ఏడ్చేశా..

నాకు అండగా నిలిచింది ఆమే..

జబర్దస్త్ నటి వర్ష తన జీవితంలోని విషాద సంఘటనలను ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. తండ్రి మరణం, తల్లి అనారోగ్యం, అన్నయ్యకు జరిగిన ప్రమాదం గురించి చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. అన్నయ్య బతికే అవకాశాలు తక్కువని వైద్యులు చెప్పడంతో ఎంత ఖర్చయినా కాపాడాలని వారి కాళ్లు పట్టుకుని వేడుకున్నానని తెలిపారు. ఆ కష్ట సమయంలో నటి రోజా తనకు ధైర్యం చెప్పి అండగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. మూడు రోజుల తర్వాత అన్నయ్యకు ప్రాణాపాయం తప్పిందని తెలిసి ఊపిరి పీల్చుకున్నానని చెప్పారు. అన్నయ్యను ఇంటికి తీసుకొచ్చిన కొద్ది గంటలకే తనకు కరోనా సోకిందని, ఈ అనుభవాలు జీవిత విలువను తెలియజేశాయని వర్ష పేర్కొన్నారు.

8 రోజుల్లోనే రూ.1,033 కోట్లు.. 'రామాయణం' రికార్డుల వేట!



భారతీయ పౌరాణిక ఇతిహాసం ఆధారంగా తెరకెక్కిన బాలీవుడ్ చిత్రం 'రామాయణం' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఎనిమిది రోజుల్లోనే రూ.1,033 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది. దీంతో అత్యంత వేగంగా వెయ్యి కోట్ల క్లబ్‌లోకి చేరిన భారతీయ చిత్రాల్లో మూడో స్థానంలో నిలిచింది. అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2', రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' సినిమాలు కేవలం ఏడు రోజుల్లోనే ఈ మైలురాయిని అందుకుని తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ రెండు చిత్రాలూ సీక్వెల్స్ కాగా.. 'రామాయణం' మాత్రం భిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. విడుదలకు ముందు విజువల్స్, పాత్రల రూపకల్పనపై మిశ్రమ స్పందనలు వచ్చినప్పటికీ.. థియేటర్లలో ప్రేక్షకుల ఆదరణతో భారీ వసూళ్లు సాధిస్తోంది. ఇందులో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్నారు. యశ్ సహ నిర్మాతగానూ వ్యవహరిస్తుండటం విశేషం. ఆఖిత్ మల్హోత్రాతో కలిసి ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com